నిండు కుండలా జీడీపీ

గోనెగండ్ల, జనవరి 21(ఆంధ్రజ్యోతి): గాజులదిన్నె ప్రాజెక్టు హంద్రీనీవా నీటితో కళకళలాడుతోంది. ప్రస్తుతం ప్రాజెక్టులో 2.2 టీఎంసీల నీరు ఉంది. దీంతో రైతులు పంట సాగుకు సిద్ధమయ్యారు. హంద్రీనీవా నుంచి రెండు నెలలుగా రోజుకు 120 నుంచి వంద క్యూసెక్కుల మేర నీరు జీడీపీకి వచ్చి చేరుతోంది. జీడీపీ కింద ఈ ఏడాది రబీ సీజన్‌లో దాదాపు 13 వేల ఎకరాల్లో ఆయకట్టు సాగైనట్లు తెలుస్తోంది. చాలా మంది రైతులు ఆరుతడి పంటలను సాగు చేసుకున్నారు. జీడీపీ కింద సాగు చేసుకున్న పంటలకు ఈ ఏడాది మార్చి నెల చివరి వరకు నీరు విడుదల చేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. అందుకు అధికారుల సైతం పంటలు చేతికి అందే వరకు నీరు విడుదల చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. జీడీపీ అధికారులు కుడి కాలువ నుంచి ఎడమ కాలువ నుంచి అవసరమైన మేర నీటిని విడుదల చేస్తున్నారు. అనవసరమైన సమయంలో రెండు కాలువలకు నీటిని నిలిపివేసి మరో వారం రోజుల తరువాత రైతుల పంటలకు అవసరమైన సమయంలో నీటి విడుదల చేస్తూ నీటిని వృథా కాకుండా పొదుపుగా వాడుతున్నట్లు అధికారులు తెలుపుతున్నారు.



గాజులదిన్నె ప్రాజెక్టులో హంద్రీనీవా నీరు

11 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు, ఒక టీఏ సస్పెండ్

- ఉపాధి పనుల్లో రూ.11,57,339 అవినీతి
- చర్యలు తీసుకున్న అధికారులు



ఉపాధి కార్యాలయం

కోసిగి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో జరిగిన అవినీతికి సంబంధించి 11 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు, ఒక టెక్నికల్ అసిసెంటును అధికారులు సస్పెండ్ చేశారు. వీరంతా 2023-24 సంవత్సరానికి గానూ జరిగిన పనుల్లో అవినీతికి పాల్పడినట్లు ఈ నెల 10వ తేదీన కోసిగిలో సోషల్ ఆడిట్ బృందం బట్టబయలు చేసింది. దీంతో మండలంలో ఉపాధి హామీ పథకంలో రూ.11,57,339 అవినీతి జరిగినట్టు తేలింది. ఇందుకుగాను ఫీల్డ్ అసిస్టెంట్లు అయిన మూగలదొడ్డి గ్రామానికి చెందిన వీరేష్, సాతనూరు విశ్వనాథ్, కందుకూరు సుజాత, చిర్తనకల్ తాయప్ప, పెద్దభోంపల్లి బీ.ఆంజనేయులు, ఐరంగల్ సురేంద్ర, చింతకుంట రాజేష్, జుమాలదిన్నె శివ, గౌడుగల్లు శివారెడ్డి, జంపాపురం నరసప్ప, డి.బెళగల్ నాగరాజులను సస్పెండ్ చేసినట్లు ఏపీవో చంద్రశేఖర్ తెలిపారు. వీరితోపాటు టెక్నికల్ అసిస్టెంట్ ఎం.విజయరాజును కూడా సస్పెండ్ చేశామన్నారు.

నేటి నుంచి జేఈఈ మెయిన్స్



కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా ప్రతిష్ఠాత్మకమైన విద్యా సంస్థలో బీటెక్, బీఆర్క్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే జేఈఈ మెయిన్-1 ప్రవేశ పరీక్ష ఆన్‌లైన్ పరీక్షలు బుధవారం ప్రారంభం కానున్నాయి. ఈ నెల 22, 23, 24, 28, 29 తేదిల్లో బీటెక్ సీట్ల భర్తీకి పేపర్-1 పరీక్ష నిర్వహిస్తారు. 30వ తేదిన బీ ఆర్క్, బీ ప్లానింగ్ సీట్ల కోసం పేపర్-2 పరీక్ష జరుగుతుంది. కర్నూలు జిల్లాలో 5 వేల మంది దాకా అభ్యర్థులు హాజరుకానున్నట్లు తెలిసింది. ఈ అభ్యర్థులకు కర్నూలు నందికొట్కూరు రోడ్డులోని సనత్ నగర్‌లోని ఆయాన్ డిజిటల్ సెంటర్‌లో ఆన్‌లైన్ పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. జేఈఈ మెయిన్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోనికి అనుమతించేదిలేదని ఎన్‌టీఏ స్పష్టం చేసింది. ఉదయం షిఫ్ట్‌లో 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్ష జరగనుంది. విద్యార్థులకు స్క్రీనింగ్ నిర్వహించనుండటంతో ఉదయం 7:30 గంటల నుంచే పరీక్షా కేంద్రంలోకి అనుమతించనున్నారు. మధ్యాహ్నం రెండో షిఫ్ట్‌లో 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పరీక్ష ఉంటుంది. ఈ విద్యార్థులకు మధ్యాహ్నం 1:30 గంటల నుంచి పరీక్షా కేంద్రంలోనికి అనుమతిస్తారు. అడ్మిన్ కార్డుతోపాటు ఒక పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటో, ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన గుర్తింపుకార్డు ఒరిజినల్ కాపీ దగ్గర ఉంచుకోవాలి. ఎలక్ట్రానిక్ పరికరాలను కేంద్రంలోనికి అనుమతించరు.

క్వింటం పత్తి రూ.7659

ఆదోని అగ్రికల్చర్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తిధర స్థిరంగా ఉంది. మంగళవారం పత్తిధర క్వింటం గరిష్ఠంగా రూ.7659 పలికింది. కేంద్ర ప్రభుత్వం కనీస మద్దతు ధర కంటే మార్కెట్‌లో పత్తి ధర రూ.150పైగా అధికంగా పలుకుతుండడంతో సిసిఐకి విక్రయించుకునేందుకు వెళ్లకుండా నేరుగా మార్కెట్ యార్డ్‌కు రైతులు తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. వారం రోజులుగా రైతులు రాకపోవడంతో సీసీఐ కొనుగోలు నిలిచిపోయాయి. 2820 క్వింటాళ్ల పత్తి విక్రయానికి రాగా కనిష్ఠ ధర రూ.4800, గరిష్ఠ ధర రూ.7659, మధ్యస్థ ధర రూ.7369 పలికింది.





రామకృష్ణను సత్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా రామకృష్ణ

బీసీ నేతకు పట్టం కట్టిన అధిష్ఠానం

6

తాగునీటి కోసం రూ.6.91 కోట్లతో యాక్షన్ ప్లాన్

కలెక్టర్ పి. రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా రూ.6.91 కోట్లతో యాక్షన్ ప్లాన్ రూపొందించినట్లు కలెక్టర్ రంజిత్ బాషా వెల్లడించారు. వేసవిలో తాగునీటి సమస్య రాకుండా ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో డిస్ట్రిక్ట్ వాటర్ అండ్ శానిటేషన్ మిషన్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 191 హ్యాబిటేషన్‌లలో తాగునీటి సమస్యల పరిష్కారానికి రూ.6.91 కోట్లతో డ్రౌట్ కంటింజెన్సీ ప్లాన్‌ను రూపొందించినట్లు తెలిపారు. జిల్లాలోని 33 సమ్మర్ స్టోరేజీ ట్యాంకులను పూర్తిగా నింపాలని అధికారులను ఆదేశించారు. పంచాయతీ సెక్రటరీ తాగునీటి పరిస్థితిపై పర్యవేక్షణ చేస్తూ ఉండాలన్నారు. సీపీడబ్ల్యూ స్కీమ్‌ల నిర్వహణ సక్రమంగా జరిగేలా జడ్పీ సీఈవో తగిన చర్యలు తీసుకోవాలన్నారు. హెచ్ఎన్ఎస్ఎస్ ద్వారా గాజులదిన్నెప్రాజెక్టుకు సరఫరా చేస్తున్న 290 క్యూసెక్కుల నీరు నష్టం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. స్పెషల్ ప్రాజెక్టు కింద జిల్లాకు 12,481 వ్యక్తిగత మరుగుదొడ్లు మంజూరయ్యాయన్నారు. ఈ సమావేశంలో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, కర్నూలు, పత్తికొండ ఆర్డీవోలు సందీప్ కుమార్, భరత్ కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, జడ్పీ సీఈవో నాసరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

పౌర గుర్తింపు సర్వే వేగవంతం చేయాలి

జడ్పీ సీఈఓ జి. నాసరరెడ్డి



మాట్లాడుతున్న జడ్పీ సీఈఓ జి. నాసరరెడ్డి

కర్నూలు న్యూసిటీ, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ ప్రయోజనాలు పొందుతూ ఏ సచివాలయ పరిధిలో నమోదు కాని పౌరులను త్వరితగతని గుర్తించి, వారు తమ సచివాలయ పరిధిలో ఉన్నట్లు ధృవీకరించాలని జిల్లా పరిషత్ సీఈఓ జి. నాసరరెడ్డి ఆదేశించారు. మంగళవారం జిల్లా పరిషత్ మినీ సమావేశ భవనంలో కర్నూలు జిల్లా ఎంపీడీఓలతో మిస్సింగ్ సిటిజెన్స్, ఎంఎస్ఎంఈ, ఆధార్ నమోదు, కో ఆపరేటివ్ సొసైటీలలో ఈ-కేవైసీ, గృహ నిర్మాణాల జియో ట్యాగింగ్, సచివాలయాల పనితీరు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 2,67,839 మంది సిటిజన్స్ ఏ సచివాలయంలో కూడ నమోదు కాలేదన్నారు. అయితే వీరంతా ల్యాండ్ రికార్డ్స్, రైస్ కార్డు, ఆరోగ్యశ్రీలో వారి పేర్లు ఉండటంతో పాటు వివిధ రకాల ప్రభుత్వ ప్రయోజనాలు పొందుతున్నారన్నారు. తక్షణమే వీరందరినీ సచివాలయాల్లో నమోదు చేయించాలని ఎంపీడీఓలను ఆదేశించారు. ప్రైమరీ అగ్రికల్చర్‌కు సంబంధించి కొంత మంది రైతులు వివిధ రకాల రుణాలు పొందుతున్నారని, వీరందరికీ ఈకేవైసీ చేయించాలని అన్నారు. ఇప్పటి వరకు కేవలం 17 శాతం మాత్రమే ఈకేవైసీ చేయించారని 100 శాతం పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో పత్తికొండ, కర్నూలు డీఎల్‌డీఓలు అనూరాధ, జీవీ. రమణారెడ్డి, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

దేహదారుఢ్య పరీక్షలో నకిలీ సర్టిఫికెట్

కర్నూలు క్రైం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్‌పీ బెటాలియన్‌లో జరుగుతున్న కానిస్టేబుళ్ల దేహదారుఢ్య పరీక్షలో తిరుమల్ అనే అభ్యర్థి చీటింగ్‌కు పాల్పడ్డాడు. తిరుమల మంగళవారం ఉదయం దేహదారుఢ్య పరీక్షలకు హాజరయ్యారు. మొదట జరిగిన ఎత్తు, ఛాతీ కొలతల్లో డిస్ క్వాలిఫై అయ్యాడు. ఆ తర్వాత బయటకు వెళ్లి మరలా పరుగు పరీక్షల వద్దకు వచ్చాడు. తాను ఎత్తు, ఛాతీ కొలతల్లో క్వాలిఫై అయినట్లు హాల్ టికెట్ చూపించాడు. అనుమానం వచ్చిన ఆర్ఐ నాగభూషణం సర్టిఫికెట్లు చెక్ చేయగా.. ఎత్తు, ఛాతీ కొలతల్లోనే డిస్‌క్వాలిఫై అయినట్లు తేలింది. తిరుమల్ ముందుగానే ఓ నకిలీ హాల్ టికెట్‌లో సెలక్షన్ బోర్డు వేసే హోలోగ్రామ్ ముద్రించి తాను క్వాలిఫై అయినట్లుగా టిక్ మార్కు వేసుకున్నాడు. ఆ తర్వాత 1600 మీటర్ల పరుగు పందెం పాల్గొనేందుకు వచ్చి పోలీసులకు చిక్కాడు. ఆర్ఐ నాగభూషణం నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో తిరుమల్‌పై ఫిర్యాదు చేశాడు. నిందితుడు కోసిగి మండలం డి. బెళగల్ గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. నిందితుడిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

267 మంది ఎంపిక



లాంగ్‌జంప్ చేస్తున్న అభ్యర్థి

పోలీసు కానిస్టేబుళ్ల నియామక దేహదారుఢ్య పరీక్షలు మంగళవారం 11వ రోజు కొనసాగాయి. కర్నూలు నగరంలోని ఏపీఎస్‌పీ రెండో బెటాలియన్‌లో నిర్వహించే ఈ పరీక్షలకు ఎస్పీ జి.బిందుమాధవ్ హాజరై పర్యవేక్షించారు. ఈ పరీక్షకు 600 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా.. 412 మంది అభ్యర్థులు బయోమెట్రిక్‌కు హాజరయ్యారు. వీరికి సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ తర్వాత ఎత్తు, చాతి ఫిజికల్ మెజర్మెంట్ టెస్టులు నిర్వహించారు. అనంతరం వీరికి నిర్వహించిన ఫిజికల్ ఎఫీషియన్సీ టెస్టులు 1600 మీటర్ల పరుగు పరీక్షలో 309 మంది అర్హత సాధించారు. 100 మీటర్ల పరుగులో 189 మంది అర్హత సాధించారు. లాంగ్ జంప్‌లో 263 మంది అర్హత సాధించారు. కానిస్టేబుల్ మెయిన్స్ పరీక్షకు 11వ రోజు 267 మంది అర్హత సాధించారు. కార్యక్రమంలో హోంగార్డు కమాండెంట్ సదరన్ రీజియన్ మహేష్ కుమార్, అడిషనల్ ఎస్పీ అడ్మిన్ జి.హుశేన్ పీరా, ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, డీపీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చివరి ఆయకట్టుకు సాగు నీరు

ఎల్లెల్సీ డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ మిక్కిలినేని ప్రసాద్

హాలహర్వి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఎల్లెల్సీ కింద సాగు చేసుకునే చివరి ఆయకట్టు రైతులందరికీ సాగు నీరందిస్తామని ఎల్లెల్సీ డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ మిక్కిలినేని ప్రసాద్ అన్నారు. మంగళవారం టీబీబీ బోర్డు అధికారులు, ఎల్లెల్సీ అధికారులతో కలిసి కాల్వపై పర్యటించారు. ఎల్లెల్సీ నీటి వాటాతో పాటు డిస్ట్రిబ్యూటరీ పరిస్థితి పూర్తి అధ్వానంగా మారిందని, పిల్ల కాల్వలన్నీ పూడికలతో నిండిపోవడంతో ఆయకట్టు రైతులకు నీరందడం లేదని రైతులు వాపోయారు. దీంతో డిస్ట్రిబ్యూటరీ చైర్మెన్ ప్రసాద్ రైతుల సమస్యలపై స్పందించారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే ఈ దుస్థితి నెలకొందని, కూటమి ప్రభుత్వం రైతులకు న్యాయం చేస్తుందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. ప్రస్తుత నీటి పారుదలశాఖ మంత్రి నిమ్మల రామనాయుడు దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఎల్లెల్సీ అధికారులు వెంటనే నిధులు మంజూరుకు అధికారులు ప్రతిపాదనలు పంపాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ యువ నాయకులు గిరిమల్లేష్ గౌడ్, డిస్ట్రిబ్యూటరీ వైస్ చైర్మన్ కురువ మల్లన్న, టీబీబీ బోర్డు ఈఈ హనేస్ బాషా, ఎల్ఎల్‌సీ ఏఈలు సఫీవుల్లా, ఈశ్వర్ పాల్గొన్నారు.



డిస్ట్రిబ్యూటరీని పరిశీలిస్తున్న ఎల్లెల్సీ చైర్మన్, నాయకులు

నల్లమల అటవీ మార్గంలో శ్రీశైలానికి కాలినడకన తరలివెళ్తున్న మల్లన్న భక్తులు(ఫైల్)



మల్లన్నా నీవే రక్షా..!

- ఏటా శ్రీశైల పాదయాత్రికులకు తప్పని అవస్థలు
- మొక్కుబడి సదుపాయాలతో సరిపెట్టుకుంటున్న వైనం
- కర్నూలు-గుంటూరు రహదారిలో కష్టాలు
- ఘాట్‌రోడ్డులో పొంచి ఉన్న ప్రమాదం
- అధ్వానంగా భీమునికొలను మెట్ల మార్గం
- నేడు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలపై కలెక్టర్ సమీక్ష

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఫిబ్రవరి 19 నుంచి మార్చి ఒకటో తేదీ వరకు శ్రీశైలంలో బ్రహ్మోత్సవాలు ఆరంభం కానున్నాయి. ఈ వేడుకలకు దేశ వ్యాప్తంగా శివభక్తులు లక్షలాదిగా తరలి వస్తారు. అయితే శ్రీశైల క్షేత్రానికి తరలివెళ్లే మల్లన్న భక్తులకు కనీస సదుపాయాలను కల్పించడంలో ఏటా శ్రీశైల దేవస్థానం అధికారులు, జిల్లా యంత్రాంగం విఫలమవుతున్నారు. ప్రత్యేకించి శ్రీశైలానికి పాదయాత్రగా వెళ్లే భక్తులకు అటవీ మార్గంలో కష్టాలు తప్పడం లేదు. బ్రహ్మోత్సవాల సందర్భంగా కేవలం శ్రీశైలంలో మాత్రమే దేవస్థానం అధికారులు సదుపాయాల కల్పనపై ఫోకస్ చేస్తున్నారు తప్ప ఇతర సమస్యలను పట్టించుకోవడం లేదు. ఈ నేపథ్యంలోనే శ్రీశైలంలో జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలపై బుధవారం కలెక్టర్ రాజకుమారి నేతృత్వంలో జరుగుతున్న సమీక్షలో వివిధ సమస్యలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

ఆత్మకూరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ప్రతిఏటా మల్లన్న భక్తులకు కష్టాలు తప్పడం లేదు. ప్రత్యేకించి కాలినడకన తరలివెళ్లే భక్తులకు అటవీ మార్గంలో అనేక అగచాట్లు ఎదురవుతున్నాయి. మహాశివరాత్రి బ్రహోత్సవాల దృష్ట్యా శ్రీశైలానికి అనంతపురం, మహబుబ్‌నగర్ తదితర జిల్లాల నుంచే కాకుండా ఉమ్మడి కర్నూలు జిల్లాలోని కోడుమూరు, ఎమ్మిగనూరు, ఆదోని, నందికొట్కూరు, డోన్, కర్నూలు, నంద్యాల తదితర ప్రాంతాల నుంచి పాదయాత్రికులు పెద్దసంఖ్యలో తరలిరానున్నారు. వీరిలో కొంతమంది తమ స్వగ్రామాల నుంచే పాదయాత్రగా వస్తుండగా మరికొందరు వెంకటాపురానికి చేరుకుని అక్కడి నుంచి యాత్రను కొనసాగిస్తారు. ముందుగా వెంకటాపురం గ్రామం నుంచి పంటపొలాల మీదుగా నాగలూటి చెంచుగూడేన్ని చేరుకుంటారు. ఆ తర్వాత 5కిమీల అటవీ మార్గంలో ప్రయాణించి నాగలూటి వీరభద్రాలయానికి సందర్శించి అక్కడి నాగలూటి తిప్పలు, దామర్లకుంట, నల్లమల కొండలపై అడవిమార్గం గుండా సుమారు 14 కిలోమీటర్ల మేర భక్తులు ప్రయాణించి పెచ్చెర్వు చెంచుగూడెనికి చేరుకుంటారు. అక్కడి నుంచి కత్తుల కొండ, కొర్కెల గుండా అటవీ ప్రాంతంలో 16కీ.మీ ప్రయాణిస్తే.. భీముని కొలను ప్రాంతానికి చేరుకుంటారు. ఆ తర్వాత ప్రమాదకర జారుడు కొండపై ప్రయాణించి కైలాస ద్వారానికి చేరుకుంటారు. అక్కడి నుంచి 6కిమీల దూరం ప్రయాణిస్తే.. శ్రీశైలానికి చేరుకోవచ్చు. అయితే నాగలూటి - పెచ్చెర్వు మధ్యలో ఎక్కడా కూడా ప్రభుత్వ సేవలు అందుబాటులో లేనట్లు తెలుస్తోంది. అదేక్రమంలో పెచ్చెర్వు నుంచి భీముడికొలను మధ్యలో తాగునీటి కోసం ఇక్కట్లు పడాల్సి వస్తోంది. భీమునికొలను కొండ ఎక్కే మార్గం ప్రమాదకరంగా ఉంది. పురాతన మెట్లు ఛిద్రం కావడంతో కొండపై పాకుతూ వెళ్లాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ఈ సమస్య ఏళ్ల తరబడి ఉన్నప్పటికీ పరిష్కారం దిశగా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. ఏదైనా అపశృతులు చోటు చేసుకుంటే ఊహించని పరిణామం ఎదుర్కొవాల్సి వస్తోంది.

సదుపాయాల కల్పనలో విఫలం

శ్రీశైలానికి పాదయాత్రగా తరలివచ్చే భక్తులకు సదుపాయాలు కల్పించడంలో జిల్లా అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. పెచ్చెర్వు, నాగలూటీ ప్రాంతాల్లో దాతలు ఏర్పాటు చేసిన అన్నదాన శిబిరాలను మినహాయిస్తే మిగతా సౌకర్యాలేవి కనిపించవు. నాగలూటిలో వున్న చిన్నపాటి కోనేరు నీరు వేలాది మంది భక్తులకు దాహార్తి తీరుస్తోంది. అయితే కోనేరులో వ్యర్థాలు చేరి కలుషితమవుతున్నాయి. అయినప్పటికీ అవే నీటిని సేవించాల్సిన దుస్థితి నెలకొంది. అలాగే అక్కడే వున్న మరో పెద్దకోనేరులో కూడా శివస్వాములు, పాదయాత్రికులు స్నానమాచరిస్తారు. వేలాదిగా భక్తులు తరలిరావడం వల్ల కోనేరులోని నీరంతా రంగుమారి దుర్వాసన వెదజల్లుతూ రోగాలకు కారణమవుతోంది. వాస్తవానికి నాగలూటి వీరభద్రాలయం వరకు వాహనాలు వెళ్లేందుకు ఆస్కారం వుంది. కనీసం ట్యాంకర్ల ద్వారా నీటి తరలిస్తే తాగునీటి కష్టాలు తీరుతాయి. అలాగే అటవీ ప్రాంతంలో కాకుండా వెంకటాపురం, రాధాపురం ప్రాంతాల్లో మాత్రమే దేవస్థానం వారు విశ్రాంతి కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నప్పటికీ అవి భక్తులకు పెద్దగా ప్రయోజనం లేకుండాపోతోంది. పెచ్చెర్వులోనే ఎక్కువ సంఖ్యలు భక్తులు బస చేస్తుంటారు. కానీ అక్కడ దేవస్థానం తరుపున ఏర్పాట్లు అంతంతమాత్రంగా ఉంటున్నాయి.

నడకదారి భక్తులకు ప్రత్యేక దర్శనం

శ్రీశైలానికి కాలినడకన తరలివచ్చే భక్తుల పట్ల దేవస్థానం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు విమర్శలున్నాయి. ఎంతో ప్రయాసతో నడిచి వచ్చే భక్తులను కంపార్టుమెంట్లలో, క్యూలైన్లలో గంటల తరబడి నిరీక్షించేలా చేస్తున్నారు. వాస్తవానికి కొన్నేళ్ల క్రితం తిరుమల తరహాలో నడిచి వచ్చే భక్తులకు పెచ్చెర్వు దాటిన తర్వాత ప్రత్యేక కంకణాలను చేతులను ధరింపజేసేవారు. ఈ కంకణాలు కలిగిన కాలినడక భక్తులకు త్వరగా దర్శనమయ్యేలా చర్యలు ఉండేవి. అయితే కొన్నేళ్లుగా ఈ ప్రక్రియను దేవస్థానం అధికారులు నిలిపివేశారు. దీంతో అటవీమార్గంలో నడిచి వచ్చే ఇబ్బందుల కన్నా.. క్యూలైన్లలో భక్తులు పడే ఇక్కట్లే ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కాలినడకన వచ్చే భక్తులపై దేవస్థానం, జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.



విశ్రాంతి కేంద్రాలు లేక అటవీ ప్రాంతంలోనే సేదతీరుతున్న శివస్వాములు (ఫైల్)



నాగలూటిలో కలుషిత నీరే శరణ్యం

సమస్యల కేజీ రహదారి



అధ్వానంగా కేజీ రహదారి

శ్రీశైల బ్రహ్మోత్సవాల నేపథ్యంలో శ్రీశైల క్షేత్రానికి లక్షలాది మంది భక్తులు కర్నూలు-గుంటూరు(కేజీ) ప్రధాన రహదారి మీదుగా శ్రీశైలానికి తరలివెళ్తుంటారు. అయితే రహదారి నిర్వహణ అధ్వానంగా ఉండటం వల్ల మల్లన్న భక్తులకు ప్రమాద హెచ్చరికలు మోగుతున్నాయి. ప్రత్యేకించి నల్లమల అటవీ మార్గంలో వున్న కేజీ రహదారికి అక్కడక్కడ ప్రమాదకర మలుపులు వుండటంతో పాటు ప్రమాద సూచికలు లేకపోవడం భక్తుల్లో ఆందోళన గురిచేస్తోంది. అదేవిధంగా రహదారి గుండా పలు ప్రదేశాల్లో రక్షణగోడలను దెబ్బతిన్నాయి. నల్లమల అటవీ మార్గంలో చాలావరకు కేజీ రోడ్డు సింగిల్‌లైన్‌గా వుంది. ఈరోడ్డుపై వాహనాల రాకపోకలకు ధుమ్ము ఏర్పడి వాహన చోదకులకు సమస్యగా మారింది. రోళ్లపెంట ఘాట్ రోడ్డు ట్రాఫిక్ సమస్య వెంటాడుతోంది. కాగా ప్రకాశం జిల్లా పరిధిలోని కేజీ రహదారి పరిస్థితి మరింత అధ్వానంగా మారింది. అదేవిధంగా దోర్నాల-శ్రీశైలం రహదారిలో కూడా ప్రమాదకర మలుపులు ఉన్నాయి. ఆయా మలుపుల వద్ద స్పీడ్‌బ్రేకర్లు, సూచికలను ఏర్పాటు చేయడంతో పాటు అక్కడక్కడ దెబ్బతిన్న రహదారిని బాగుచేయాలని మల్లన్న భక్తులు కోరుతున్నారు.

వైద్యశిబిరాల నిర్వహణ లోపం



శ్రీశైలానికి తరలివెళ్లే భక్తుల సౌకర్యార్థం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో దారిపొడవునా.. అక్కడక్కడ వైద్యశిబిరాలను ఏర్పాటు చేస్తారు. అయితే వీటి నిర్వహణ ప్రతిఏటా నామమాత్రంగానే నడుస్తున్నాయని అనేక మార్లు జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. పైగా వైద్యశిబిరాల్లో జ్వరం, నొప్పులు, విరేచనాలు తదితర మందులు మినహాయిస్తే.. మెరుగైన వైద్యసేవలకు ఉపయోగపడే మందులేవి అందుబాటులో వుండవు. ఈ శిబిరాలు కూడా ప్రధాన ప్రాంతాల్లో తప్ప నట్టడివిలో లేకపోవడంతో భక్తులు అగచాట్లు పడుతున్నారు. అసలే అటవీ ప్రాంతంలో కొండలనుఎక్కుతూ, దిగుతూ.. వెళ్లాల్సి వుంటుంది. ఈ ప్రయాణంలో భక్తులు అస్వస్థతకు గురయ్యే ప్రమాదంతో పాటు కాళ్లకు దెబ్బలు తగిలి రక్తగాయాలు వంటి సంఘటనలు జరుగుతుంటాయి. అదేవిధంగా శ్రీశైలానికి 24గంటల పాటు భక్తులు తరలివెళ్తుంటారు. అయితే వైద్యశిబిరాలు మొక్కుబడిగా నిర్వహిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. కాగా నడిచి వెళ్లే భక్తులు అస్వస్థతకు, గుండెపోటుకు గురై మరణించిన సందర్భాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అటవీ మార్గంలో అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచుతామని దేవస్థానం అధికారులు తెలిపినప్పటికీ గత ఏడాది ఎక్కడా కనిపించలేదు.

తెలుగు కీర్తి పురస్కారాలు ప్రదానం



నాగేశ్వరయ్యను సత్కరిస్తున్న దృశ్యం

కర్నూలు కల్చరల్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): కర్నూలుకు చెందిన ఇద్దరు తెలుగు కీర్తి పురస్కారాలను అందుకున్నారు. కర్నూలుకు చెందిన కవి, రచయిత, కళాకారుడు కేవీ నాగేశ్వరయ్య, ప్రజా కవి, జిల్లా వినియోగ దారుల కమిషన్ సభ్యుడు ఎస్. నారాయణరెడ్డిలు ఈ పురస్కారాలను అందుకున్నారు. మంగళవారం విజయవాడలోని శ్రీకౌతా పూర్ణానంద విలాస్ సమావేశ హాలులో శ్రీశ్రీ కళావేదిక సంస్థ ప్రకటించిన 'తెలుగు కీర్తి' పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. ఈ సందర్భంగా నాగేశ్వరయ్య, నారాయణ రెడ్డిలకు నిర్వాహకులు జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేసి శాలువకప్పి పుష్పమాలతో ఘనంగా సత్కరించారు. ఈ పురస్కారం తమకు మరింత స్ఫూర్తినిచ్చిందని నాగేశ్వరయ్య, నారాయణరెడ్డిలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీశ్రీ కళావేదిక అధ్యక్షుడు కత్తిమండ ప్రతాప్, వేదిక ప్రతినిధులు పాల్గొన్నారు.



పురస్కారం అందుకుంటున్న నారాయణరెడ్డి

కేన్సర్ హాస్పిటల్‌కు రూ.25 లక్షలు

జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు



కర్నూలు హాస్పిటల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): స్టేట్ కేన్సర్ హాస్పిటల్‌కు కావాల్సిన కనీస పరికరాల కొనుగోలు కోసం సీడీఎస్ నుంచి రూ.25 లక్షల నిధులు వాడుకోవడానికి అడిషనల్ డీఎంఈ డాక్టర్ పి.వెంకటేశ్వర్లు ఆమోదం తెలిపినట్లు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు తెలిపారు. ఆంధ్రజ్యోతిలో ఆదివారం ప్రచురితమైన 'సర్దుబాటు చేయడానికి వచ్చారా..?' అన్న కథనంపై ఆసుపత్రి సూపరింటెండెంట్ వివరణ ఇచ్చారు. కేన్సర్ హాస్పిటల్‌కు సంబంధించి రావాల్సిన ఇతర పరికరాల కోసం ఏపీఎంఎస్ఐడీసీ ఇంజనీరింగ్ అధికారులతో నేరుగా మాట్లాడి వాటిని త్వరితగతిన ఆసుపత్రికి అందించడానికి చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించినట్లు తెలిపారు. సిబ్బంది, నర్సింగ్ సిబ్బంది కోసం రిక్రూట్‌మెంట్ త్వరగా చేయడానికి ఆదేశించినట్లు చెప్పారు. శానిటేషన్, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ నూతన ఏజెన్సీలు టెండర్ల ప్రక్రియ ఈ నెల చివరికల్లా పూర్తవుతుందని, ఈ టెండర్లలోనే కేన్సర్ హాస్పిటల్‌కు కూడా సిబ్బంది వస్తారని చెప్పారు. ఆక్సిజన్ పైపులైన్, జనరేటర్, పనులు వారంలోపు ఇంజనీర్ అధికారులు పూర్తి చేయిస్తారన్నారు. 15 మంది శానిటేషన్, 15 మంది సెక్యూరిటీ సిబ్బందిని కేన్సర్ హాస్పిటల్‌కు తాత్కాలికంగా కేటాయించామని చెప్పారు. ఫిబ్రవరి మొదటి వారంలో ఎట్టి పరిస్థితుల్లో స్టేట్ కేన్సర్ ఆసుపత్రి ప్రారంభించడానికి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, స్పెషల్ సీఎస్ కృష్ణబాబు ఆదేశించారని, ఇందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.

అప్‌గ్రేడేషన్‌లో నిబంధనలు పాటించాలి: ఆర్జేడీ



సమావేశంలో మాట్లాడుతున్న కడప ఆర్జేడీ శ్యామూల్

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని ప్రాథమికోన్నత పాఠశాలల అప్‌గ్రేడేషన్‌లో నిబంధనలు పాటించాలని కడప ఆర్జేడీ శ్యామూల్ ఆదేశించారు. మంగళవారం స్థానిక జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయంలోని సమావేశ భవనంలో డీఈవో శ్యామ్యూల్ పాల్ అధ్యక్షతన ఎంఈవోలతో సమావేశం నిర్వహించారు. డీఈవో మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఆదర్శ ప్రాథమిక పాఠశాలలు ఉండాలన్నారు. గ్రామంలోని ప్రతి తరగతికి ఒక టీచర్ ఉండేలా చూడాలన్నారు. పాఠశాలల్లో 120 మంది విద్యార్థులు ఉంటే పాఠశాలల ప్రధానో పాధ్యాయుల పోస్టును ఇస్తారన్నారు. విద్యార్థుల సంఖ్య 150 మంది ఉంటే.. ప్రతి 30 మంది విద్యార్థులకు అదనంగా ఒక టీచర్‌ను నియమించనున్నట్లు తెలిపారు. ఈ నెల 24న కర్నూలులో ఎంఈవోలు, హెచ్‌ఎంలతో రాష్ట్ర పాఠశాలల విద్యా కమిషనర్ విజయరామరాజు సమావేశం నిర్వహిస్తారని, జి.పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలోని సమావేశ భవనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏపీసీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

పౌరాణిక నాటకానికి చిరునామా 'చీమకుర్తి'

టీజీవీ కళాక్షేత్రంలో కళాకారుల ఘన నివాళి

కర్నూలు కల్చరల్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): సత్య హరిశ్చంద్ర నాటకానికి రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు తెచ్చి చిరునామాగా దివంగత నటుడు చీమకుర్తి నాగేశ్వరరావు నిలిచిపోయారని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు విద్వాన్ పత్తి ఓబులయ్య కొనియాడారు. మంగళవారం చీమకుర్తి 19వ వర్ధంతిని పురస్కరించుకొని నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో చీమకుర్తి చిత్రపటానికి పుష్పమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన పౌరాణిక పద్య నాటక రంగానికి చేసిన సేవలను వక్తలు కొనియాడారు. ఈ సందర్భంగా పత్తి ఓబులయ్య మాట్లాడుతూ కేవలం ఐదో తరగతి వరకు చదివిన చీమకుర్తి మూడు వేలకు పైగా సత్య హరి శ్చంద్ర నాటకాన్ని ఆంధ్రదేశంతో పాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో ప్రదర్శించారని అన్నారు. ఆయన 2006 జనవరి 21న దివంగతులయ్యారని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాక్షేత్రం కార్యదర్శి మహ్మద్ మియా, ప్రతినిధులు ఇనాయతుల్లా, ఈ.పాండురంగయ్య, గాండ్ల లక్ష్మన్న, పీపీ గురుమూర్తి, డి.ఈశ్వరయ్య, సీవీ రెడ్డి, బాలవెంకటేశ్వర్లు, కేవీ రమణ, జాఫర్, క్రిస్టఫర్ తదితరులు పాల్గొన్నారు.



చీమకుర్తి నాగేశ్వరరావుకు నివాళి అర్పిస్తున్న పత్తి ఓబులయ్య, కళాకారులు

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా రామకృష్ణ

బీసీ నేతకు పట్టం కట్టిన అధిష్ఠానం

కర్నూలు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ (బీజేపీ) జిల్లా అధ్యక్షుడిగా బీసీ నేతకు అధిష్ఠానం పట్టం కట్టింది. మంత్రాలయం నియోజకవర్గం కౌతాళం గ్రామానికి చెందిన అక్కమ్మతోట రామకృష్ణ ఎంపికయ్యారు. మంగళవారం స్థానిక నరసింహారెడ్డి నగర్‌లోని బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్ష ఎన్నికలు జరిగాయి. జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా పోతుకుంట రమేశ్‌నాయుడు, కర్నూలు పార్లమెంట్ రాష్ట్ర పరిశీలకులు కృష్ణయ్యయాదవ్ ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి. ప్రస్తుత అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ సహా పలువురు సీనియర్ నేతలు, యువ నాయకులు జిల్లా అధ్యక్ష పీఠం కోసం పోటీ పడ్డారు. పది రోజుల క్రితమే జిల్లా అధ్యక్ష ఎన్నిక ప్రక్రియ మొదలైంది. 12 మంది నాయకులు జిల్లా అధ్యక్ష పదవి ఆశిస్తూ నామినేషన్లు దాఖాలు చేశారు. ఆ నామినేషన్లు పరిశీలించిన రాష్ట్ర అధిష్ఠానం, ఎన్నికల విభాగం 12 మందిలో కౌతాళంకు చెందిన రామకృష్ణ, కర్నూలుకు చెందిన అంబలి కాశీవిశ్వనాథ్ పేర్లను ఎంపిక చేసి జాతీయ నాయకత్వానికి పంపించారు. ఆ ఇద్దరిలో బీసీలలో రజక సామాజికవర్గానికి చెందిన రామకృష్ణ వైపు మొగ్గు జాతీయ నాయకత్వం మొగ్గు చూపింది. మంగళవారం జరిగిన సమావేశంలో ఎన్నికల అధికారి పోతుకుంట రమేశ్‌నాయుడు రాష్ట్ర నాయకత్వం సూచన మేరకు బీజేపీ జిల్లా నూతన అధ్యక్షుడిగా రామకృష్ణ పేరును ప్రకటించారు. ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, తాజా మాజీ అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ, సీనియర్ నాయకులు రామకృస్వామి, డాక్టర్ వినీషారెడ్డి, న్యాయవాది గీతామాధురి, కాశీవిశ్వానాథ్, జీఎస్ నాగరాజు, ప్రేమకుమార్ తదితరులు పూలమాలలతో రామకృష్ణను అభినందించారు. అనంతరం బీజేపీ సీనియర్ నేత, రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ సహా పలువురు సీనియర్ నాయకులను కలిశారు.

రాష్ట్ర సమన్వయ కమిటీ కన్వీనర్ కపిలేశ్వరయ్య ప్రోత్సాహంతో 2012లో సామాన్య కార్యకర్తగా చేరిన రామకృష్ణ మండల అధ్యక్షుడిగా, జిల్లా ఉపాధ్యక్షుడిగా, బీసీ మోర్చ, కిసాన్ మోర్చ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. పార్టీ అప్పగించిన త్రీమెన్ కమిటీ కన్వీనర్, బూత్ స్వశక్తీకరణ జిల్లా కన్వీనర్ బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించారు. కరోనా సమయంలో బీజేపీ హెల్త్ వాలంటరీ కన్వీనర్‌గా సేవలు అందించారు. ప్రస్తుతం జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతూ.. జిల్లా అధ్యక్ష పీఠం దక్కించుకున్నారు. రామకృష్ణది వ్యవసాయ కుటుంబం. ఆయన తల్లిదండ్రులు వెంకమ్మ, కృష్ణయ్య భార్య అమృత, కుమార్తె కల్పన, కుమారుడు దుర్గాప్రసాద్ సంతానం.



మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్‌ను కలిసిన బీజేపీ అధ్యక్షుడు రామకృష్ణ, ఆ పార్టీ నాయకులు

పార్టీ బలోపేతం చేస్తా : రామకృష్ణ

బీజేపీ జాతీయ అధ్యక్షడు జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరిలు నాపై ఎంతో నమ్మకంతో జిల్లా అధ్యక్ష పదవి ఇచ్చారు. దేశ ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా ఆశీస్సులతో జిల్లా సీనియర్ నాయకులు, నియోజకవర్గం కన్వీనర్లు, అనుబంధ సంఘాల నాయకులు, యువ నేతలను సమన్వయం చేసుకుంటూ గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తాను. కేంద్రంలో ప్రధాని మోదీ సామరధ్యంలోని ఎన్డీఏ ప్రభుత్వం, రాష్ట్రంలో సీఎం చంద్రబాబు సామరధ్యంలోని కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఇంటికి అందేలా చూస్తా. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి సర్దుబాటు ప్రకారం బీజేపీ కేటాయించే స్థానాల్లో, కూటమి పార్టీలు విజయం సాధించేందుకు కృషి చేస్తా.

ముగిసిన అంతర్రాష్ట్ర ఫుట్‌బాల్ పోటీలు



ఫలక్‌నుమా జట్టుకు ట్రోఫీ ఇస్తున్న తహసీల్దార్ శేషఫణి



రన్నర్స్ ట్రోఫీతో ఎమ్మిగనూరు జట్టు

- ట్రోఫీని కైవసం చేసుకున్న ఫలక్‌నుమా జట్టు

ఎమ్మిగనూరు టౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): నీలకంఠేశ్వర స్వామి జాతర సందర్భంగా జరుగుతున్న అంతర్రాష్ట్ర ఫుట్‌బాల్ టోర్నమెంట్ మంగళవారం ముగిసింది. బీవీ జయనాగేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక బాలుర కళాశాల మైదానం నిర్వహించిన ఈ పోటీల్లో 40 టీమ్‌లు పోటీ పడ్డాయి. మంగళవారం ఫైనల్ మ్యాచ్‌లో ఫలక్‌నుమా, ఎమ్మిగనూరు జట్లు హోరాహోరీగా తలపడ్డాయి.

నిర్ణీత సమయంలో రెండు జట్లు 3-3 గోల్స్‌తో నిలవగా రెఫరీలు ఇరుజట్లకు మరో 20 నిమిషాలు సమయం కేటాయించాయి. మరోసారి డ్రా కాగా పెనాల్టీ షూటౌట్ నిర్ణయించారు. ఇందులో ఫలక్‌నుమా 4-2 గోల్స్ చేసింది. దీంతో ఫలక్‌నుమాను విజేతగా ప్రకటించారు. అంతకు ముందు 3వ స్థానం కోసం హైదరాబాద్ గ్లోబల్ ఎఫ్‌సీ, చైతు ఎఫ్‌సీ జట్లు పోటీ పడగా హైదరాబాద్ గ్లోబల్ ఎఫ్‌సీ 3-0 గోల్స్‌తో విజయం సాధించి 3వ స్థానం కైవసం చేసుకుంది. ముఖ్య అతిథిగా హాజరైన తహసీల్దార్ శేషఫణి, డీఈ నాగేంద్రప్రసాద్‌లు మాట్లాడుతూ నిర్వాహకులు ఎక్కడ రాజీ పడకుండా ఆటగాళ్లకు వసతులు కల్పించారని అన్నారు. విన్నర్స్‌కు ట్రోఫీతోపాటు నగదు రూ.1,50,000, రన్నర్స్ జట్టుకు ట్రోఫీతో పాటు నగదు రూ.లక్ష ప్రదానం చేశారు. నిర్వాహకులు రామకృష్ణ నాయుడు, కామర్తి మహేష్, ఎన్‌టీకే ఈరన్న, బందె నవాజ్, భాస్కర్, మహేంద్ర బాబు, ప్రిన్సిపాల్ కృష్ణయ్య, చిత్రలేఖ, వనజ, విజేత నాగరాజు, కుమార్, సర్దాజ్, ఆర్మీ రఘు, వంశీ, ఈరన్న పాల్గొన్నారు.

- అంతర్రాష్ట్ర ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో విదేశీ ఆటగాళ్ల పాల్గొన్నారు. వీరు వరంగల్‌లోని కాకతీయ విశ్వవిద్యాలయంలో బీ ఫార్మసీ, బీటెక్‌ల చదువు కోసం ఇండియాకు వచ్చారు. ఆరు రోజుల పాటు జరిగిన పోటీల్లో నైజీరియన్ క్రీడాకారులు ఉన్న గ్లోబల్ ఎఫ్‌సీ టీమ్ సెమీఫైనల్ చేరడం విశేషం. వీరు ఇక్కడ ఫుట్‌బాల్ వీరి ఆటను చూడడానికి ప్రజలు ఆసక్తి కనబరిచారు.



మాతృ మరణాలపై సమీక్ష నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో

రక్తహీనత గర్భిణులను త్వరగా గుర్తించాలి

కర్నూలు హాస్పిటల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో ఏఎన్ఎం, ఆశా, వైద్యాధికారులు రక్తహీనతగల గర్భిణులను గుర్తించి వారికి వైద్యసేవలు అందించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.శాంతికళ ఆదేశించారు. జిల్లా వైద్యఆరోగ్య శాఖ కార్యాలయంలో నవంబరు, డిసెంబరు నెలలో జరిగిన మాతృ మరణాలపై డీఎంహెచ్‌వో జిల్లా స్థాయి సమగ్ర గర్భస్రావ సంరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. అనంతరం మాతృ మరణాల నివారణ కోసం కర్నూలు జెమ్‌కేర్ కామినేని హాస్పిటల్ ఎమ్మిగనూరు చెందిన ధీరన్ మెడికల్ హాస్పిటల్ వైద్యులను సమీక్షకు పిలిపించి తగు సూచనలు చేశారు. సమీక్షలో డీసీహెచ్ఎస్ డా.మాధవి, డిప్యూటీ డీఎంహెచ్‌వో డా.సత్యవతి, డీఐవో డా.నాగప్రసాద్, కర్నూలు జీజీహెచ్ గైనకాలజి ప్రొఫెసర్లు డా.పద్మజ, డా.మంజూషా, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డా.ప్రియాంక, నెఫ్రాలజిస్టు డా.శ్రీధర్‌శర్మ, కల్లుదేవకుంట పీహెచ్‌సీ డా.భావన, డీపీహెచ్ఎన్‌వో అన్నపూర్ణ, ఎస్‌వో హేమసుందరం పాల్గొన్నారు.

గోదాముల అద్దె చెల్లించకుంటే సీజ్

- ఆదోని మార్కెట్ యార్డు కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి



ఆదోని అగ్రికల్చర్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మార్కెట్ యార్డ్‌లో గోదాముల అద్దె చెల్లించాలని, లేకుంటే రెవెన్యూ రికవరీ యాక్ట్ ఉపయోగించి గోదాములను సీజ్ చేస్తామని మార్కెట్ యార్డ్ కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి హెచ్చరించారు. మంగళవారం ఆయన తన చాంబర్‌లో మాట్లాడుతూ మూడేళ్లుగా కొంతమంది లైసెన్స్ పొందిన కమీషన్ ఏజెంట్స్, వ్యాపారులు తాము ఉండే గోదాములకు అద్దె చెల్లించకుండా మొండికేశా రన్నారు. అద్దె చెల్లించిన వారికి పలుమారులు నోటీసులు జారీచేసినా పట్టించుకోవడం లేదన్నారు. రూ.38 లక్షలు పేరుకుపోయిందని అన్నారు. వారు వ్యాపారాలు చేసుకొని లైసెన్సులు రెన్యువల్ చేసుకోకుండా అలాగే దుకాణాల్లో కొనసాగుతున్నారని, దీంతో తాము హెచ్చరించి కొన్నిటికి తాళాలు వేశామని అన్నారు. ఇక నుంచి ఉపేక్షించమని అద్దె చెల్లించని గోదాములను రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం మధ్య సీజ్ చేస్తామని చివరి నోటీసు అందించామన్నారు.

నేడు కాంగ్రెస్ జై సంవిధాన్ పాదయాత్ర

కర్నూలు అర్బన్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి అమిత్ షా అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్ చేపట్టిన జై సంవిధాన్ పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు డీసీసీ పరిగెల మురళీకృష్ణ తెలిపారు. బుధవారం ఉదయం 10.45కు జై బాపూజీ, జైభీమ్, జై సంవిధాన్ పాదయాత్రలో కాంగ్రె స్ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి ప్రారంభమయ్యే పాదయాత్ర పాత బస్టాండ్ చేరుకొని, అక్కడ గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశాక, మీటింగ్ జరుగుతుందని పేర్కొన్నారు.

'వేరుశనగ విత్తనాలు కొనాలి'



నేషనల్ సీడ్స్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

నంద్యాల రూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): వేరుశనగ విత్తనాలు కొనుగోలు చేసి తమకు న్యాయం చేయాలని కోరుతూ గోస్పాడు మండలం ఎంకృష్ణాపురం గ్రామ వేరుశనగ సాగు రైతులు నూనెపల్లెలోని నేషనల్ సీడ్స్ కార్పోరేషన్ ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తంచేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సీడ్స్ కార్పొరేషన్ అగ్రిమెంట్ ద్వారా పండించిన వేరుశనగ విత్తనాలను కొనుగోలు నిమిత్తం 40 రోజుల క్రితం నేషనల్ సీడ్స్ కార్పొరేషన్‌కు తరలించామన్నారు. కంపెనీ నిబంధనల ప్రకారం కేజి వేరుశనగకు రూ.50 ప్రకారం రైతులకు చెల్లించాల్సి ఉండగా ఇంతవరకు రూపాయి కూడా చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సరఫరా చేసిన విత్తనాలను కూడా ప్రాసెసింగ్ చేయడానికి అధికారులు నిరాకరిస్తున్నారని ఆరోపించారు. విత్తనాలు వానలో తడిసి బాగాలేవని అభాండాలు వేస్తున్నారని కన్నీటి పర్యంతమయ్యారు. ఒక్కొక్క ఎకరా సాగుకు రూ70,000 ఖర్చు చేశామని, సాగుకు బ్యాంకుల, ప్రవేట్ వ్యక్తుల వద్ద అప్పులు చేశామని, ప్రస్తుతం దిక్కుతోచని స్థితిలో ఉన్నామన్నారు, సీడ్స్ కార్పోరేషన్ వేరుశనగ విత్తనాలను కొనుగోలు చేయక పోతే ఆత్మహత్యే శరణ్య మన్నారు. నేషనల్ సీడ్స్ అధికారులు అగ్రిమెంట్ మేరకు విత్తనాలను కొనుగోలు చేయాలని, మొలకల శాతంలో ఎమైనా తేడాలొస్తే బాధ్యత వహిస్తామన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



కురువ నాగన్న (ఫైల్)

మంత్రాలయం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలం లోని వగరూరు గ్రామానికి చెందిన కురువ నాగన్న (76) అనే రైతు ఇంటి వద్ద విద్యుదాఘాతానికి గురై ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం జరిగింది. మంత్రాలయం ఎస్ఐ పరమేష్ నాయక్, కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. మృతుడు నాగన్న తన కొత్త ఇంటి నిర్మాణం చేపట్టాడు. కొడుకు బీరప్ప గోడకు సీలింగ్ చేస్తున్నాడు. ఇంటి వద్ద కొళాయి మోటారును ఆఫ్ చేయాలని చెప్పడంతో నాగన్న స్విచ్ఛాఫ్ చేయడానికి వెళ్లి విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య అంజినమ్మ, ముగ్గురు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు. విషయం తెలుసుకున్న మంత్రాలయం పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి సోదరుడు సీనియర్ నాయకులు రామకృష్ణారెడ్డి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యంగా ఉండాలని చెప్పారు.

వ్యక్తి ఆత్మహత్య

బనగానపల్లె, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలం లోని పలుకూరు గ్రామానికి చెందిన చాకలి నాగేంద్రప్రసాద్ (26) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు నందివర్గం ఎస్ఐ వెంకటసుబ్బయ్య మంగళవారం తెలిపారు. గత కొన్ని నెలల నుంచి నాగేంద్రప్రసాద్ కడుపునొప్పితో బాధప డేవారని, అనేకసార్లు డాక్టర్లకు చూపించినా రోగం తగ్గకపో వడంతో జీవితంపై విరక్తి చెంది పలుకూరులోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద పురుగుల మందు తాగినట్లు ఎస్ఐ తెలిపారు. మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు ఆయన వెల్లడించారు. భార్య చాకలి మద్దమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారని చెప్పారు.

చెవి కమ్మను లాక్కెళ్లిన దుండగుడు

సి. బెళగల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆదర్శ పాఠశాల సమీపంలో నడుచుకుంటూ వెళుతున్న వృద్ధురాలు అనుమక్క చెవి కమ్మను ఎమ్మిగనూరు నుంచి మోటార్ సైకిల్‌పై వెళుతున్న వ్యక్తి లాక్కెళ్లాడు. ఈ ఘటన మంగళవారం జరిగింది. దీనిపై ఆమె కుమారులు స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ తిమ్మారెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

'వాల్మీకులపై తప్పుడు ప్రచారం తగదు'



మాట్లాడుతున్న వాల్మీకి సంఘం నాయకులు

కర్నూలు కలెక్టరేట్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి వ్యతిరేక శక్తులు వాల్మీకుల గురించి తప్పుడు ప్రచారం చేస్తున్నాయని, ఇది తగదని వాల్మీకి సంఘం నాయకుడు కుబేరస్వామి, మహర్షి వాల్మీకి రిజర్వేషన్ ప్రజా సమితి రాష్ట్ర అధ్యక్షుడు బోయ పులికుండన్న మహర్షి వాల్మీకి రిజర్వేషన్ ప్రజాసమితి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు నాగేశ్వరి నాయుడు సూచించారు. కర్నూలు నగరంలోని బీసీ భవన్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి ఏపీలో వాల్మీకులు 1956కు ముందు ఎస్టీలుగా ఉన్నారని, అయితే కొందరు రాజకీయ కుట్రతో ఎస్టీలుగా తొలగించారన్నారు. మైదాన ప్రాంతంలో బోయలు బీసీలుగా, ఏజెన్సీలో ఎస్టీలు అని విభజించారని అన్నారు. ఆనాటి నుంచి వాల్మీకులు ఎస్టీ రిజర్వేషన్ పునరుద్ధరణ కోసం పోరాటం చేస్తున్నారన్నారు. పాలకులు ఎన్నికల ముందు ఒక మాట, తర్వాత ఒక మాట మాట్లాడుతూ మోసం చేస్తూనే ఉన్నారు. వాల్మీకులు ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందరాని తప్పుడు ప్రచారం చేయడం దుర్మార్గమన్నారు. ఎస్టీలుగా కొత్తగా చేర్చాలని కోరడం లేదని, పునరుద్ధరణ చేయాలని కోరుతుండగా కొందరు అవగాహన లేక మాట్లాడుతున్నారని అన్నారు. వీబీఎస్ఎస్ పెద్దయ్య, ఎంవీఆర్‌పీఎస్ నాయకులు సుధాకర్ నాయుడు, నరసింహులు, సాయి, వంశీ నాయుడు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం అక్రమ రవాణా తగ్గింది

- ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్‌బాబు



కోసిగి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక మద్యం అక్రమ రవాణా తగ్గుముఖం పట్టిందని, ప్రైవేటు వైన్ షాపుల వల్ల ప్రభుత్వ ఆదాయం భారీగా పెరిగిందని ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్‌బాబు అన్నారు. మంగళవారం కోసిగిలోని ఎక్సైజ్ సర్కిల్ పోలీస్‌స్టేషన్‌లో ఆయన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా సుధీర్‌బాబు మాట్లాడుతూ కోసిగి, పెద్దకడుబూరు మండలాల పరిధిలోని నాలుగు మద్యం దుకాణాలకు గానూ మూడు నెలల్లో రూ.10 కోట్లు మద్యం అమ్మకాలు జరిగాయని అన్నారు. కర్ణాటక మద్యం కొన్ని ప్రాంతాల్లో ఇంకా సరఫరా అవుతోందని పూర్తిగా అరికట్టాలని పోలీసులకు సూచించారు. అలాగే కర్నూలు జిల్లాలో కల్లు గీత కులాలకు సంబంధించి జిల్లాకు 10 మద్యం షాపులకు నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. జిల్లాలో గౌడ కులాలకు 3, ఈడిగలకు 6, గౌడకు మొత్తం 10 దుకాణాలకు నోటిఫికేషన్ విడుదల చేశామని తెలిపారు. అభ్యర్థులు తమ కుల, నేటివిటి ధ్రువపత్రాలు సమర్పించాలని, ఒక షాపునకు ఫీజు రూ.2 లక్షలు, నాన్ రెఫండబుల్ అని తెలిపారు. ఒక అభ్యర్థికి ఒక షాపు మాత్రమే ఇస్తామన్నారు. ఈ షాపు గడువు 30.09.2026 వరకు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ భార్గవ్ రెడ్డి, ఎస్ఐ కార్తిక్ సాగర్, ఎక్సైజ్ సిబ్బంది ఉన్నారు.

నాగలదిన్నెలో గుప్త నిధుల పుకార్లు


నందవరం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగలదిన్నె గ్రామంలో గుప్త నిధులు లభ్యమయ్యాయని పుకార్లు రావడంతో మంగళవారం అధికారులు గ్రామానికి చేరుకొని విచారణ చేపట్టారు. తుంగభద్ర నది దగ్గర వైద్యశాల వెనుక భాగంలో చెట్లు కొడతూ వాటి బుడమలు తొలగిస్తుం డగా వాటి కింద 40 కేజీల బంగారు అండ దొరికినట్లు పుకార్లు వచ్చాయి. దీంతో తహసీల్దారు శ్రీనివాసులు, ఎస్ఐ శ్రీనివాసులు నాగలదిన్నె గ్రామానికి చేరుకొని మంగళవారం విచారణ చేశారు. రెండు రోజుల తర్వాత వివరాలు తెలుస్తాయని అధికారులు తెలిపారు.



నాగలదిన్నెలో విచారణ చేస్తున్న అధికారులు

సుప్రీంకోర్టులో అనుకూలమైన తీర్పు

- రాఘవేంద్రస్వామి మఠంలో సంబరాలు



మాట్లాడుతున్న పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

మంత్రాలయం జనవరి 21(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘ వేంద్రస్వామి గురువులైన మధ్వాచార్యుల ప్రత్యక్ష శిష్యులైన నరహరి తీర్థులు రాఘవేంద్రస్వామి మఠానికి అనుకూలంగా సుప్రీం కోర్టులో తీర్పు రావడంతో సంబరాలు చేసుకున్నారు. మంగళవారం సాయంత్రం తీర్పు రాగానే మఠం పీఠాధిపతులు సుబుధేంద్రతీర్థులు, మఠం అధికారులు, శిష్యులు, ఉద్యోగులు, భక్తులు బాణాసంచా పేల్చి పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఊంజల మండపంలో భక్తుల నుద్దేశించి పీఠాధిపతి మాట్లాడారు. గత 26 ఏళ్లుగా నరహరి తీర్థుల బృందావనానికి పూజలు చేయకుండా ఉత్తరాధి మఠం చెందిన యజ మాన్యం కోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకున్నారని, కింది కోర్టు ఆర్డర్లను రద్దు చేస్తూ వారి పిటిషన్‌ను సుప్రీం కోర్టు తిరస్కరించడంతో పెద్ద ఎత్తున భక్తులు మంగళవారం రాత్రే నరహరితీర్థులు వెలసిన హంపి తుంగభద్ర నది వద్ద వెలసిన నరహరితీర్థుల బృందావనానికి బయలుదేరి వెళ్లారు. బుధవారం వేలాదిమంది సంబరాలు చేసుకోవాలని పీఠాధిపతి పిలుపునిచ్చారు. ఇది అందరి విజయమని రాఘవేంద్రస్వామి శిష్యులకు అంకితమన్నారు. కార్యక్ర మంలో విద్వాన్ రాజా ఎస్ గిరిరాజాచార్, ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషీ, శ్రీపతాచార్, ఈఈ, మేనేజర్-సీ సురేష్ కోనాపూర్, బీఎం ఆనందరావు, ఐపీ నరసంహమూర్తి, అనంతపు రాణిక్, రవికుల కర్ణి, విజయేంద్రాచార్, గోపాలకృష్ణ స్వామి, వాదీంద్రాచార్, రాజాఎస్ అప్రమేయాచార్, ఎస్ఎన్ రఘునందనాచార్, అధికారులు పాల్గొన్నారు.

నేడు కర్నూలుకు డీజీపీ

కర్నూలు క్రైం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర డీజీపీ ద్వారక తిరుమల్‌రావు బుధవారం కర్నూలుకు రానున్నారు. ఉదయం నంద్యాలలో తనిఖీ చేసి అనంతరం కర్నూలు రానున్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా కర్నూలుకు వస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది.

భూ సేకరణ వేగవంతంగా పూర్తి చేయండి

కర్నూలు కలెక్టరేట్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): వివిధ జాతీయ రహదారుల నిర్మాణం, విస్తరణ వాటిపై బైపాస్ రహదారుల నిర్మాణానికి సంబంధించి అవసరమైన భూసేకరణను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్లు, జేసీలను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే.విజయానంద్ ఆదేశిం చారు. జాతీయ రహదారుల నిర్మాణం, విస్తరణ, బైపాస్ రహదారుల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ, అటవి అనుమతుల మంజూరు తదితర పెండింగ్ అంశాలపై మంగళవారం రాష్ట్ర సచివాలయం నుంచి రెవెన్యూ అటవి, టీఆర్‌అండ్‌బీ జాతీయ రహదారుల సంస్థ, మినిస్ట్రీ ఆఫ్ రోడ్డు ట్రాన్స్‌పోర్టు అడ్ హైవేస్ శాఖల అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్, జేసీలతో వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ఈకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రంజిత్ బాషా, జాయింట్ కలెక్టర్ నవ్య పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి

ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి



రాజేశ్వరిని సన్మానిస్తున్న ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి

గోనెగండ్ల, జనవరి 21(ఆంధ్రజ్యోతి): బాలికలు అన్ని రంగాలలో రాణించాలని ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. మంగళవారం గోనెగండ్లలోని కస్తూర్బా బాలికల పాఠశాలను ఎమ్మెల్యే పరిశీలించారు. పాఠశాలలో ఇంటర్ చదువుతున్న రాజేశ్వరి ఇటీవల మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాలో జాతీయ స్థాయిలో బేస్‌బాల్ పాల్గొని ప్రతిభను చాటింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పార్థసారథి విద్యార్థినిని సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ఆడపిల్ల పుట్టగానే భయపడే నేటి సమాజంలో ఇలాంటి అమ్మాయిలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐ గంగాధర్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

సీఎం కృషితో విశాఖ ఉక్కుకు భరోసా

టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, టీటీడీ పాలక మండలి సభ్యుడు మల్లెల రాజశేఖర్



మాట్లాడుతున్న మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు కృషితో విశాఖ ఉక్కు పరిశ్రమకు కేంద్రం నుంచి ఆర్థిక భరోసా లభించిందని నంద్యాల టీడీపీ జిల్లా అధ్యక్షుడు, టీటీడీ పాలక మండలి సభ్యుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. మంగళవారం హుస్సేనాపురం గ్రామంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ చంద్రబాబు కృషి, పట్టుదల వల్లే ఆర్థిక సంక్షోభంలో ఉన్న విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కేంద్రం రూ.11,440 కోట్ల ఆర్థిక ప్యాకేజీ ఇచ్చిందని అన్నారు. దీనికి కేంద్ర ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఆమోదముద్ర వేయడం అభినందనీయమని అన్నారు. ఏటా 7.3 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యం ఉన్న స్టీల్‌ప్లాంట్ గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయిందని విమర్శించారు. ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉత్తరాంధ్ర అభివృద్ధితో పాటు విశాఖ ఉక్కు పరిశ్రమపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఉత్తరాంధ్రకే కాకుండా మొత్తం ఏపీకే విశాఖ ఉక్కు కర్మాగారం మణిహారం అన్నారు. ఆనాడు ఎంతో మంది తెలుగు వారు వీరోచిత పోరాటాలు, త్యాగాలు చేసి సాధించుకున్న సంస్థను పునరుజ్జీవింపజేస్తుందని అన్నారు. విశాఖ ఉక్కును ప్రైవేటుపరం చేయాలని, ఉక్కు ఆస్తులను అమ్ముకోవాలని జగన్ ప్రయత్నిస్తే, విశాఖ ఉక్కును పరిరక్షించాలని చంద్రబాబు అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహబూబ్ బాషా, కెవి. మధు, బజారు, వేణు తదితరులు పాల్గొన్నారు.

రహదారులకు మరమ్మతులు చేపట్టండి



పైపులైన్ లీకేజీని పరిశీలిస్తున్న కమిషనర్

కర్నూలు న్యూసిటీ, జనవరి 21(ఆంధ్రజ్యోతి): నగరంలో అధ్వానంగా తయారైన రహదారులకు మరమ్మతులు చేపట్టాలని నగర పాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అధికారులను ఆదేశించారు. మంగళవారం నెహ్రూనగర్, రాధాక్రిష్ణ థియేటర్, జమ్మిచెట్టు, వడ్డేగేరి, డాక్టర్స్ కాలనీ తదితర ప్రాంతాలలో ఆయన పర్యటించారు. ఆయా కాలనీల్లో ధ్వంసమైన రహదారులు, మురుగు కాలువలను పరిశీలించి, అవస రమైన నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అదేవిధంగా గార్గేయపురం డంప్‌యార్డులో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చేస్తున్న డ్రోన్ సర్వేను కమిషనర్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఆయన వెంట ఆరోగ్య అధికారి కె.విశ్వేశ్వరరెడ్డి, ఎస్ఈ జి.రాజశేఖర్, ఎంఈ సత్యనారాయణ, డీఈఈ క్రిష్ణలత, గంగాధర్, కార్పొరేటర్ పర్వాజ్‌ఖాన్ ఉన్నారు.

మహాసభను జయప్రదం చేయండి

కర్నూలు న్యూసిటీ, జనవరి 21(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ నగర 9వ మహాసభను జయప్రదం చేయాలని యూనియన్ నగర కార్యదర్శి కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం ఏఐటీయూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రవాణా రంగంలో ఉన్న లక్షలాది ఆటో కార్మికులకు భద్రత కల్పించడంలో వైఫల్యం చెందాయన్నారు. కార్మికులు భవిష్యత్తు కార్యాచరణ రూపొందించేందుకు మహాసభలు నిర్వహిస్తున్నామన్నారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప, నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్, యూనియన్ నాయకుడు రాము పాల్గొన్నారు.

రీ సర్వేతో భూ సమస్యలు పరిష్కారం

గూడూరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): రీ సర్వేతో భూ సమస్యలు పరిష్కారం అవుతాయని తహసీల్దార్ రామాంజనేయులు అన్నారు. మంగళవారం గూడూరు తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని చనుగొండ్ల గ్రామంలో రీ సర్వే కార్యక్రమం ప్రారంభమైందన్నారు. రీ సర్వే బృందాలు గ్రామ సరిహద్దులను నిర్ణయిస్తారని, రైతులు తమ పొలాలకు సంబంధించిన పత్రా లను సిద్ధంగా ఉంచుకోవాలని అన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఓర్వకల్లు జనవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని హుశేనాపురం గ్రామానికి చెందిన సంకలి కురువ రవికుమార్(25) కర్నూలు ప్రభు త్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రవికుమార్ శనివారం హుశేనా పురం నుంచి ఓర్వకల్లు పొగాకు గోడౌన్ వద్దకు ద్విచక్ర వాహనంపై వస్తుండగా.. నంద్యాల నుంచి కర్నూలు వైపు వెళ్లే గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. అతడిని చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా కోలుకోలేక మృతి చెందాడు. కుమారుడు మృతితో తల్లిదండ్రులు దస్తగిరి, చిన్నమ్మ శోకసంద్రంలో మునిగిపోయారు. మృతదేహానికి టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్, మండల తెలుగు యువత అధ్యక్షుడు రాము, కేవీ మధు, గ్రామస్థులు సందర్శించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆడపిల్లలను చదివించాలి: సీడీపీవో



పోస్టర్లను విడుదల చేస్తున్న సీడీపీవో అనూరాధ

ఓర్వకల్లు జనవరి 21(ఆంధ్రజ్యోతి): ఆడపిల్లలను చదివించాలని ఐసీడీఎస్ సీడీపీవో అనూరాధ అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయం లో కిషోరి వికాసంపై అంగన్‌వాడీ టీచర్లకు, సిబ్బందికి శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈసందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ కౌమార వయస్సు పిల్లల కోసం మండల స్థాయిలో కిషోరి వికాసం శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. బాల్య వివాహాలు చట్టరీ త్యా నేరమన్నారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్ర మంలో సూపర్‌వైజర్లు నజ్మ, అనూష, అంగన్‌వాడీ టీచర్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

కర్నూలులో ఫెర్టీ-9 ఫెర్టిలిటీ సెంటర్



ఫెర్టీ9 ఫెర్టిలిటి సెంటర్‌ను ప్రారంభిస్తున్న మెడికల్ డైరెక్టర్ డాక్టర్ జ్యోతి

కర్నూలు హాస్పిటల్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): నంద్యాల చెక్‌పోస్టు సమీపంలో ఫెర్టీ-9 ఫెర్టిలిటి సెంటర్‌ను సెంటర్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ జ్యోతి మంగళవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కర్నూలులో నూతనంగా ఏర్పాటు చేసిన కేంద్రం ద్వా రా సంతానోత్పత్తి చికిత్సలను నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఫెర్టీ-9 ఐవీ ఎఫ్ కన్సల్టెంట్ డాక్టర్ సుశ్రుత మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి అధునాతన సంతానోత్పత్తి సంరక్షణను అందుబాటులోకి తీసుకు రావడమే తమ లక్ష్యమన్నారు.

అనాథలకు అన్నదానం



అనాథలకు భోజనం వడ్డిస్తున్న న్యాయవాదులు

కర్నూలు రూరల్ జనవరి 21 (ఆంధ్రజ్యోతి): నగర శివారులో ఉన్న బత్తుల మాధవస్వామి సేవాసమితి, హోం ఆఫ్ హోప్ అనాథాశ్రమంలో మంగళవారం పిల్లలకు అన్నదానం చేశారు. ఈకార్యక్రమానికి సీనియర్ న్యాయవాదులు పోకల శ్రీనివాసులు, ప్రసాద్, శ్రీవాత్సవ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. నిజాయితీతో పనిచేసే వారిని ఉన్నత స్థాయికి చేరుస్తాయన్నారు.

జీజీహెచ్‌లో వెల్‌నెస్ క్లినిక్ ప్రారంభం



వెల్‌నెస్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్

కర్నూలు హాస్పిటల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఏపీ స్వర్ణ ఆంధ్ర విజన్ 2047లో భాగంగా కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల నూతనంగా ఏర్పాటు చేసిన వెల్‌నెస్ క్లినిక్ (ప్రివెంటివ్ క్లినిక్) ఓపీ నెంబర్.333 కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ సి.చిట్టినరసమ్మతో కలిసి ఆసుపత్రి సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ మాట్లాడుతూ ఆధునిక జీవనశైలిలో మధుమేహం, రక్తపోటు, గుండె, స్థూలకాయం, కిడ్నీ వ్యాధుల దృష్ట్యా తమ ఆరోగ్యాన్ని చురుగ్గా ఉంచుకోవడానికి ఈ క్లినిక్ ఓపీ సేవలు ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ శ్రీరాములు, సీఎస్ఆర్ఎంవో డాక్టర్ బీవీరావు, అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం, ఎస్పీఎం హెచ్‌వోడీ డాక్టర్ సుధా కుమారి, ప్రొఫెసర్ డా.సింధియా శుభప్రద హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ డా.శివబాల, డా.కిరణ్‌కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రీబాయి పాల్గొన్నారు.

హద్దులు ఏర్పాటు చేయాలి

టీడీపీ నాయకుడు పేరపోగు పెద్ద లక్ష్మన్న డిమాండ్



నినాదాలు చేస్తున్న లబ్ధిదారులు

కర్నూలు రూరల్ జనవరి 21(ఆంధ్రజ్యోతి): కర్నూలు రూరల్ మండలం బి.తాండ్రపాడు గ్రామ పరిధిలోని సర్వే నెంబరు 277లో అప్పటి ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఇంటి స్థలాల పట్టాలకు తక్షణమే హద్దులు ఏర్పాటు చేయాలని కోడుమూరు నియోజకవర్గ టీడీపీ సీనియర్ నాయకుడు పేరపోగు పెద్ద లక్ష్మన్న డిమాండ్ చేశారు. ఈమేరకు ఆయన మంగళవారం వందల మంది లబ్ధిదారులతో కలిసి తాండ్రపాడులో అప్పటి ప్రభుత్వం కేటాయించిన భూమి వద్దకు చేరు కుని నినాదాలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 2013లో అప్పటి ప్రభుత్వం బి.తాండ్రపాడులో సర్వే నెం 277లో దాదాపు 1300 మంది నిరుపేదలకు ఇంటి పట్టాలు ఇచ్చిందన్నారు. అప్పట్లో ఎన్నికల కోడ్ రావడంతో లబ్ధిదారులకు కొలతలు వేసి ప్లాట్లు వేయలేకపో యిందన్నారు. అనేక సార్లు ప్రభుత్వం, పాలకుల దృష్టికి తీసుకెళ్ళిన ప్రయోజనం లేకుండా పోయిందని అన్నారు. కోడుమూరు టీడీపీ సీనియర్ నాయకుడు ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి సహకారంతో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్ దృష్టికి తీసు కెళ్లామన్నారు. తప్పకుండా న్యాయం చేస్తానని వెంటనే తహసీల్దార్‌కు ఆదేశాలు జారీ చేశారని లక్ష్మన్న వివరించారు. విష్ణువర్ధన్‌రెడ్డి చొరవతో ఏళ్ల నాటి సమస్య పరిష్కారమవుతుందని ఆశించి ఆ కాలనీకి ఆయన కుమారుడు మాజీ ఎంపీపీ, దివంగత డి.రాజవర్ధన్ రెడ్డి కాలనీగా నామకరణం చేసి బోర్డును పాతినట్లు తెలిపారు. అంతేకాకుండా కొత్తగా మరో 14 వార్డులు వెలిశా యని, వార్డుకు వంద చొప్పున మొత్తం 1400 మందికి ఇంటి పట్టాలు ఇవ్వాలని పేరపోగు పెద్దలక్ష్మన్న డిమాండ్ చేశారు.

విశాఖ ఉక్కుకు కేంద్రం భరోసా

పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత



కల్లూరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు పరిశ్రమకు కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం అన్ని విధాలా ఆర్థిక భరోసా అందిస్తుందని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత మంగళవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ఆంధ్రరాష్ట్ర మణిహారం విశాఖ కర్మాగారం వేలాది ప్రజల వీరోచిత పోరాటాలు, త్యాగాలతో సాధించుకున్న విశాఖ స్టీల్ ప్లాంట్ పునరుజ్జీవానికి కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తుందన్నారు. గత సీఎం జగన్ తనపై ఉన్న కేసుల నుండి విముక్తి కోసం రాష్ట్రాన్ని తాకట్టు పెట్టేలా హస్తిన పర్యటనలు ఉండేవన్నారు. ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన విశాఖస్టీల్ ప్లాంట్‌ను కాపాడేందుకు రూ.11,440 కోట్ల ఆర్థిక ప్యాకేజీని ఇచ్చేందుకు కేంద్ర ఆర్థిక వ్యవహారాల క్యాబినేట్ ఆమోదముద్ర వేసిందన్నారు. విశాఖ ఉక్కును ప్రైవేటుపరం చేయాలని, అమ్ముకోవాలని జగన్‌రెడ్డి ప్రయత్నిస్తే ఉక్కు పరిశ్రమను ఏవిధంగా పరిరక్షించాలని సీఎం చంద్రబాబు అహర్నిశలు శ్రమిస్తున్నారని ఎమ్మెల్యే వివరించారు.

వైసీపీ దుష్ప్రచారాలను నమ్మొద్దు

కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి



కర్నూలు రూరల్ జనవరి 21(ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రభుత్వంపై వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కాపాడేందుకు సీఎం చంద్రబాబు అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక విశాఖ స్టీల్ ప్లాంటు కోసం రూ.11440 కోట్ల ఆర్థిక ప్యాకేజీని ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని గుర్తు చేశారు. ఆ విషయం తెలియక వైసీపీ నాయకులు అనవరంగా కూటమి ప్రభుత్వంపై బురద జల్లుతున్నారని ఆరోపించారు.

ఎక్సైజ్ పోలీసు స్టేషన్ తనిఖీ



పోలీసుల వివరాలు తెలుసుకుంటున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్‌బాబు

కోడుమూరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): కోడుమూరు ఎక్సైజ్ పోలీసు స్టేషన్ సూపరింటెండెంట్ సుధీర్‌బాబు మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వివిధ కేసుల్లో పట్టు పడిన వాహన వివరాలు, కేసుల పురోగతి వంటి విషయాలు ఎక్సైజ్ సీఐ మంజులను అడిగి తెలుసుకున్నారు. కేసులకు సంబంధించిన రికార్డులు పరిశీ లించారు. ఆయన వెంట అసిస్టెంట్ సూపరింటెండెంట్ రామకృష్ణారెడ్డి, ఎక్సైజ్ ఎస్ఐ శ్రీలక్ష్మీ, చంద్రమోహన్ కానిస్టేబుళ్లు తిరుపాలు, సుజాత, సాయికుమార్, జగదీష్, నాగయ్య, భూలక్ష్మీ ఉన్నారు.

పశువుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం వద్దు

సి.బెళగల్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): పశువుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం వహించొద్దని మండల పశువైద్యాధికారి ప్రవీణ్ రైతులకు సూచిం చారు. మంగళవారం మండల కేంద్రమైన సి.బెళగల్‌లో సర్పంచ్ పాండురంగన్న అధ్యక్షతన ఉచిత పసువైద్య శిబిరాన్ని ప్రారంభి ంచారు. ఈసందర్భంగా పశువైద్యాధికారి ప్రవీణ్ మాట్లాడుతూ బురాన్‌దొడ్డి, గొల్లలదొడ్డి, కంబంధహల్ గ్రామాల్లో పాడిపశువుల కోసం ప్రభుత్వం వెటర్నరి అసిస్టెంట్లను ఏర్పాటు చేసిందన్నారు.

సీసీ రోడ్ల పనుల పరిశీలన

సి.బెళగల్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన సి.బెళగల్, కంబంధహల్, పలుకుదొడ్డి, సంగాల గ్రామాల్లో నిర్మిస్తున్న సీసీ రోడ్ల పనులను పంచాయతీరాజ్ ఏఈ వెంకట్ ప్రకాశ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో గోకులం షెడ్లను నిర్మించుకోకపోతే వాటిని రద్దు చేస్తామన్నారు. ఆయన వెంట సూపరింటెండెంట్ శ్రీనివాసులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సర్పంచులు ఉన్నారు.

ఉన్నతాధికారితో విచారణ జరిపించాలి

కర్నూలు కలెక్టరేట్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): నాయకల్లు గ్రామానికి చెందిన భారతి అదృశ్యం కేసును మహిళా పోలీసు ఉన్న తాధికారితో విచారణ జరిపించాలని కోరుతూ మంగళశారం ప్రజా సంఘాలు డీఎస్పీని కలిసి కోరారు. ఈ సందర్భంగా పట్నం రాజేశ్వరి జయన్న ఎరుకుల రాజు, క్రాంతి కుమార్ మాట్లాడుతూ 2025 సంవత్సరం జనవరి 1వ తేదీ మధ్యాహ్నం 12 గంటల నుంచి మహిళ భారతి కనబడటం లేదని ఆరోపించారు. అదృశ్యం కేసు ఛేదించి న్యాయం చేయాలని కోరారు.

పశువులకు నట్టల నివారణకు మందులు

కోడుమూరు రూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పశువులకు నట్టల నివారణకు మందులు వేయించాలని పశుసంవర్ధక శాఖ జిల్లా జేడీ డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం అమడగుంట్ల గ్రామంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ కార్యక్రమంలో భాగంగా లేగ దూడల ప్రదర్శన జరిగింది. కార్యక్రమానికి జేడీ, డీడీ దుర్గాప్రసన్న బాబు, ఎల్‌డీఏ ఈవో రాజశేఖర్ హాజరయ్యారు. లేగదూడల ప్రదర్శన లో యజమానులకు బహుమతులు ప్రదానం చేశారు. ఉచితంగా డీవార్మింగ్ మందును అందించారు. కార్యక్రమంలో ఏడీలు రామసుబ్బారెడ్డి, రవిబాబు, పశువైద్యాధికారులు పాల్గొన్నారు.

పదో తరగతి స్టడీ మెటీరియల్ ఆవిష్కరణ

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు సులభంగా ఉత్తీర్ణులు కావడానికి ఎస్టీయూ ఏపీ అకడమిక్ కమిటీ తయారు చేసిన ఎస్ఎస్‌సీ స్టడీ మెటీరియల్‌ను స్థానిక డీఈవో కార్యాలయంలో డీఈవో శామ్యూల్‌పాల్, ఉప విద్యాశాఖ అధికారి హనుమంతురావు మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్టీయు జిల్లా అధ్యక్షుడు గోకారి, ప్రధాన కార్యదర్శి టీకే జనార్దన్ పాల్గొన్నారు.

క్రీడాకారులకు సన్మానం

కర్నూలు స్పోర్ట్స్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక అవుట్‌డోర్ స్టేడియంలో మోడ్రన్ పెంటాథలాన్ జాతీయ పోటీలకు వెళ్లే క్రీడాకారులు వెంకట భరత్, వెంకటేశ్వరీలకు న్యాయవాది శ్రీధర్ రెడ్డి, మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ దాసెట్టి శ్రీనివాసులు, ఇస్మాయిల్ బాషా నగదు ప్రోత్సాహం అందజేసి సన్మానించారు. ఫిబ్రవరిలో డెహ్రాడన్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని విజయంతో తిరిగి రావాలని ఆకాంక్షించారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు: ఏవో



విత్తన ప్యాకెట్‌ను తనిఖీ చేస్తున్న ఏవో

సి.బెళగల్ జనవరి 21 (ఆంధ్రజ్యోతి): నకిలీ విత్తనాలను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కు మార్ హెచ్చరించారు. మంగళవారం సి.బెళగల్, కంబంధహల్ గ్రామాల్లోని విత్తన దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఏవో మాట్లాడుతూ రైతులకు విక్రయించే విత్తనాలను బ్యాడ్జి నంబర్లు రికార్డులలో నమోదు చేసి విక్రయించాలన్నారు. ఏవో వెంట ఎంపీఈవోలు వెంకటేశ్వర్లు, శశిదేవి ఉన్నారు.

కాలువలకు మరమ్మతులు చేపట్టాలి



విష్ణువర్ధన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నాయకులు

కోడుమూరు రూరల్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ఎల్లెల్సీ డీసీ 8 పరిధిలోని కాలువలకు మరమ్మతులు చేపట్టాలని పలు గ్రామాల టీడీపీ నాయకులు కోరారు. మంగళవారం పలు గ్రామాల టీడీపీ నాయకులు, రైతులు పార్టీ సీనియర్ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తుంగభద్ర కాలువలు దెబ్బతినడంతో సాగునీరు అందడం లేదన్నారు. డీసీ 8 పరిధిలో చాలా ఏళ్లుగా కాలువల నిర్వహణ లేకపోవడంతో పూడికతో నిండిపోయిందన్నారు. డబ్ల్యూయూఏ 43,44,45,46,47 కాలు వల మరమ్మతులు, అవసరమైన చోట పునర్నిర్మాణం చేపట్టాలని కోరారు. దీంతో వెంకటగిరి, గోరంట్ల, ముడుమలగుర్తి, ఎర్రదొడ్డి, లద్దగిరి గ్రామాల్లో వేలాది ఎకరాలకు సాగునీరు అందుతుందని తద్వారా రైతులు, కూలీలు వలసలు వెళ్లే అవసరం తప్పుతుందన్నారు. సమస్యను సీఎం చంద్రబాబు, మంత్రులు నారా లోకేశ్, నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరుకు కృషి చేస్తానని విష్ణువర్ధన్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు టీడీపీ నాయకులు కున్నూరు మధు సూదన్‌నాయుడు, సద్దల బాలక్రిష్ణ, వెంకటగిరి రాజు పాల్గొన్నారు.

చెరువు గట్టుపై శ్రమదానం



శ్రమదానం చేస్తున్న ఎస్‌డీఆర్ఎఫ్ బృందం సభ్యులు

కర్నూలు కల్చరల్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విపత్తుల నివారణ దళం (ఏపీ ఎస్‌డీఆర్ఎఫ్) ఆధ్వర్యంలో మంగళవారం శ్రమదానం నిర్వహించారు. ఏపీ ఎస్‌డీఆర్ఎఫ్ కర్నూలు టీమ్ డీఎస్పీ ఐ.సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్‌డీఆర్ఎఫ్ బృందం గార్గేయపురం సమీపంలోని సిటీ ఫారెస్టు వద్ద గల చెరువు గట్టుపై మొలచిన పిచ్చి మొక్కలను తొలగించి, చెరువు గట్టు బాటను శుభ్రం చేసింది. ఈ సందర్భంగా డీఎస్పీ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ విపత్తుల సమయంలో తమ దళం ఎప్పుడూ సహాయ కార్యక్రమాలకు సిద్ధంగా ఉంటుందని, అలాగే స్వచ్ఛ భారత్, స్వచ్ఛాంధ్రప్రదేశ్ కార్యక్రమాల్లో భాగంగా ఈ శ్రమదానం చేసినట్లు వివరించారు.

స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలి



ఏపీఈఆర్‌సీ చైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కల్లూరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలని పట్టణపౌర సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం దిన్నెదేవరపాడు సమీపంలోని ఏపీఈఆర్‌సీ భవన్‌లో చైర్మన్ ఠాకూర్ రామ్‌సింగ్, సభ్యుడు పీవీఆర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈనెల ఒకటిన కమిషన్‌కు అభ్యంతరాలు తెలిపామని సంఘం నాయకుడు ఈ.పుల్లారెడ్డి తెలిపారు. ఇప్పటి వరకు విద్యుత్ పంపిణీ కోసం ప్రభుత్వ అనుమతి పొందిన మూడు డిస్కంలు ఉండగా మరో ప్రైవే టు సంస్థకు లైసెన్సులు ఇస్తున్నట్లు తెలిసిందని ఆరోపించారు. విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ ఠాకూర్‌రామ్‌సింగ్ మాట్లాడుతూ విద్యుత్ పంపిణీ కోసం కొత్త సంస్థకు అనుమతులు ఇవ్వమన్నారు. కార్యక్రమంలో సీవీ వర్మ, యూనస్, వన్నూర్‌సాహెబ్, శివప్రసాద్ చౌదరి ఉన్నారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

గూడూరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని నియోజకవర్గ స్థాయిలో విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించినట్లు తహసీల్దార్ రామాంజనేయులు తెలిపారు. మంగళవారం గూడూరులోని జడ్పీ బాలికల పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన వ్యాస రచన, వక్తృత్వ పోటీలను తహసీల్దార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 25న జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ పోటీలను నిర్వహించామని, ఇందులో ప్రథమ, ద్వితీయ విజేతలుగా నిలిచిన వారు ఈనెల 23న జిల్లా స్థాయి లో జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

లెనిన్ ఆశయ సాధన కోసం కృషి చేద్దాం

కర్నూలు న్యూసిటీ, జనవరి 21(ఆంధ్రజ్యోతి): లెనిన్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ అన్నారు. మంగళవారం సుందరయ్య భవన్‌లో లెనిన్ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెట్టుబడిదారి సమాజంలో కార్మిక వర్గాన్ని ఐక్యం చేసి పోరాటం ద్వారా 1917లో కార్మిక రాజ్యాన్ని మొట్టమొదటిగా నిర్మించిన మహానేత లెనిన్ అని కొనియాడారు. కార్యక్రమంలో టి.రాముడు, రాజశేఖర్, గురుశేఖర్, సాయిబాబా, సుధాకర్ పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికి తీయాలి



పోస్టర్ విడుదల చేస్తున్న డీఈవో శ్యామ్యూల్ పాల్

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయాలని డీఈవో శామ్యూల్ పాల్ అన్నారు. మంగళవారం స్థానిక డీఈవో కార్యాలయంలో బాలోత్సవ నిర్వాహకులతో కలిసి ఆయన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సంద ర్భంగా డీఈవో మాట్లాడుతూ విద్యార్థులు సృజనాత్మకతను కోల్పోతు న్నారని, దీనికి ప్రధాన కారణం మొబైల్ అడిక్షన్, సామాజిక మాధ్యమాలని అన్నారు. కార్యక్రమంలో ప్లానింగ్ కన్వీనర్ కెంగార మోహన్, జేఎన్ శేషయ్య, ధనుంజయ, యుఆర్‌పి రవికుమార్, జయ రాజు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పరీక్షా పే చర్చకు ఎంపిక

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన పరీక్షా పే చర్చకు కర్నూలు ఏపీజే అబ్దుల్ కలాం స్మారక మున్సిపల్ పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థిని ఈపూరు సుహృతి పాల్గొని జాతీయ స్థాయికి ఎంపికైంది. మంగళవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో విద్యార్థిని ఈపూరు సుహృతిని డీఈవో శ్యామ్యూల్ పాల్ అభినందించారు. పరీక్షాపే చర్చ కార్యక్రమంలో ఒత్తిడి నిర్వహణ, రీల్ వర్సెస్ రియల్ అనే అంశంపై చర్చ జరిగిందని సుహృతి ప్రతిభ కనబరిచి అందరి ప్రశంసలు పొందిందని ప్రధానో పాధ్యాయురాలు విజయలక్ష్మి తెలిపారు. విద్యార్థినిని ప్రోత్సహించిన ప్రధానోపాధ్యాయురాలు, గైడ్ టీచర్‌ను డీఈవో అభినందించారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

కర్నూలు న్యూసిటీ, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్యాలయానికి వచ్చే ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని నగర పాలక మేనేజర్ చిన్నరాముడు అన్నారు. మంగళవారం నగర పాలక కార్యాలయంలోని పన్ను వసూళ్లు, ప్రజాఫిర్యాదుల స్వీకరణ, జనన మరణ ధ్రువీకరణ పత్రాల జారీ విభాగాలను మేనేజర్ తనిఖీ చేశారు. ఉద్యోగులు ప్రజలతో బాధ్యతగా వ్యవహరించాలన్నారు.

గానాల రామ్మూర్తి ఆశయాలను నెరవేరుద్దాం



రామ్మూర్తి విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీసీ సంఘం నాయకులు

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): గానాల రామ్మూర్తి ఆశయాలను నెరవేరుద్దామని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు యాదవ్ అన్నారు. మంగళవారం బీ.క్యాంపులోని విశ్వబ్రాహ్మణుల పితామహుడు గానాల రామ్మూర్తి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమములో జాతీయ బీసీ సం క్షేమ సంఘం జాతీయ క్యాదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు, బ్రహ్మయ్య, వేం ఎంట రాంబాబు, వెంకటేశ్వర్లు, పట్నం రాజేశ్వరి, ఆనంద్ పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక బీసీ భవన్‌లో గానాల రామ్మూర్తి జయంతి వేడుకలు జరిగాయి. శేషఫణి, భరత్ కుమార్, బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ధనుంజయఅచారి, కుబేర్ స్వామి, రాజేష్, నంది విజయలక్ష్మి పాల్గొన్నారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దండి

ఓర్వకల్లు జనవరి 21(ఆంధ్రజ్యోతి): మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని టాటా కాన్సులెన్సీ అధికారి తేజ అన్నారు. మంగళవారం ఓర్వకల్లులోని మండల ఐక్య సంఘం శిక్షణా భవనంలో ఉల్లాస్ యోజన విద్య అక్షరాస్యతపై మహిళలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఈసందర్భంగా తేజ మాట్లాడుతూ నిరక్షరాస్యులుగా ఉన్న ప్రతి ఒక్క మహిళ సాయంత్రం వేళల్లో 2 గంటల సేపు అక్షరాలు నేర్చుకుని ప్రయోజకులు కావాలన్నారు. కార్యక్రమంలో వయోజన విద్యాశాఖ అడిషినల్ విద్యాశాఖ అధికారి శ్రీనివాసులు, ఏపీఎం వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

రైలు బండి ఆగేదెప్పుడు?

- మద్దికెరలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపాలని ప్రయాణికుల వినతి
- కరోనా అనంతరం నిలవని ఎక్స్‌ప్రెస్ రైళ్లు



మద్దికెర, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మద్దికెర రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపడం లేదు. దీంతో దూర ప్రాంత ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఇది గుంతకల్లుకు 12కి.మీల దూరంలో ఉంది.

కరోనాకు ముందు ఆపేవారు..

స్థానిక రైల్వేస్టేషన్‌లో కరోనా కంటే ముందు వరకు అన్ని రైళ్లు ఆపేవారు. దీంతో రైల్వేస్టేషన్ ప్రయాణికులతో కళకళలాడేది. అయితే కరోనా సమయంలో ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఈ స్టేషన్‌లో ఆపడం నిలిపివేసి, కేవలం ప్యాసింజర్లను మాత్రమే ఆపుతున్నారు. గతంలో కాచిగూడ, బెంగుళూరు, విజయవాడ, హుబ్లీ, హౌరా, వాస్కోడిగామా, వాస్కోడిగామా-హౌరా, హుబ్లీ-విజయవాడ, బెంగుళూరు-కాచిగూడ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగేవి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు.

ప్రజా ప్రతినిధులకు పలుమార్లు వినతులు

మద్దికెరలో ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలని ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబుకు విన్నవించారు. అలాగే అప్పటి ఎంపీ, ఎమ్మెల్యే సంజీవకుమార్, శ్రీదేవికి, డీఆర్ఎంకు ఆపద్బాంధవ సేవా సమితి సభ్యులు సంతకాల సేకరణ చేసి పలుమార్లు విన్నవించి, నిరసన తెలిపినా ఎవరూ పట్టించుకోవడం లేదు.

దూర ప్రాంత ప్రయాణికులకు అవస్థలు

స్థానిక స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగకపోడంతో గుంటూరు, విజయవాడ, హైదరాబాద్, హుబ్లి, బెంగళూరు వంటి దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. అర్ధరాత్రి సమయాల్లో గుంతకల్లుకు వెళ్లి అక్కడి నుంచి రైలులో వెళ్లాల్సి వస్తోంది. ఏమాత్రం ఆలస్యమైనా రైళ్లు వెళ్లిపోతున్నాయి. రాజధానికి తెల్లవారుజామున 2 గంటలకు రైలు ఉంది. అక్కడికి చేరుకునే సరికి మధ్యాహ్నం 2 గంటలు అవుతుందని, తమ పనులు కావడం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


డీఆర్ఎంకు వినతి పత్రం

దూర ప్రాంతాలకు వెళ్లాలంటే ఇబ్బంది

మద్దికెర రైల్వేస్టేషన్‌లో అన్ని వసతులు ఉన్నా, ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపడం లేదు. దూర ప్రాంతాలకు వెళ్లాలంటే గుంతకల్లు వెళ్లి రైలు ఎక్కాలి. రైల్వే అధికారులు స్పందించాలి.
- వేణుగోపాల్, ఎడవలి



బీసీలకు అవకాశం పట్ల హర్షం

ఆదోని టౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా కౌతాళానికి చెందిన బీసీ నాయకుడు రామకృష్ణను ఎంపిక చేయడం పట్ల ఓబీసీ మోర్చా మాజీ అధ్యక్షుడు మలేకార్ శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. నాయి బ్రాహ్మణ కమిటీ సభ్యుడు ఎస్‌సీ రంగస్వామి రామకృష్ణను అభినందించారు. బీసీలకు ప్రాముఖ్యత ఇవ్వడంతో పార్టీ పురోభివృద్ధికి అవకాశం లభించిందన్నారు.

దైవ మార్గాన్ని అనుసరించాలి

మద్దికెర, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రజలు దైవ మార్గాన్ని అనుసరించాలని హైదరాబాద్‌కు చెందిన జ్యోతిష్కుడు నారాయణ స్వామి అన్నారు. మంగళవారం సుబ్రహ్మణ్యం స్వామిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు విజయప్రసాద్ యాదవ్ వారికి స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని అందజేశారు. ఆపద్బాంధవ సేవా సమితి అధ్యక్షులు చొక్క సునీల్ కుమార్, రంగనాథ్ ఉన్నారు.

జిల్లా అధ్యక్షుడి ఎంపికపై హర్షం

దేవనకొండ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): బిజెపి జిల్లా అధ్యక్షుడిగా అక్కమతోట రామకృష్ణ ఎంపికపై పార్టీ మండల అధ్యక్షుడు బొల్లెద్దుల కిరణ్ హర్షం వ్యక్తం చేశారు. పార్టీ అభివృద్ధికి రామకృష్ణ కృషి చేస్తారన్నారు.

సభ్యులు లేని సమావేశం


మాట్లాడుతున్న ఎంపీడీవో వరలక్ష్మి

హాలహర్వి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు లేరు. మంగళవారం నిర్వహించిన సమావేశానికి అధికారులు డుమ్మా కొట్టారు. ఎంపీటీసీలు సంతకానికే పరిమితమయ్యారు. దీంతో తూతు మంత్రంగా కొనసాగింది. అధికారులు లేక సభ్యులు లేక సర్పంచులు సైతం నోరుమెదక మమ అనిపించారు. రెవెన్యూ అర్అండ్‌బీ, ఆర్టీసీ, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్, జలవనరులు ఇతర శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. ప్రజాప్రతినిధులు కూడా సంతకాలు పెట్టి వెళ్లిపోయారు. ఎంపీడీవో వరలక్ష్మి, ఎంపీపీ నెట్టికం టిమ్మ, జడ్పీటీసీ లింగప్ప పాల్గొన్నారు.


కర్ణాటక మద్యం స్వాధీనం

ఆదోని, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఆదోని ఎక్సైజ్ ఎస్ఐ సైదుల్లా తెలిపారు. వివరాల మేరకు.. మంగళవారం కౌతాళం మండలం కుంభలూరు క్యాంప్ వద్ద ముత్యాల ప్రసాద్ అనే వ్యక్తిని అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి ఏడు కేసుల కర్ణాటక బీర్‌తో పాటు నాలుగు మద్యం బాక్సులను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



కర్ణాటక మద్యాన్ని చూపుతున్న పోలీసులు

ఐక్యంగా ఉండాలి


మాట్లాడుతున్న పార్టీ నాయకుడు రంగన్న

దేవనకొండ, జనవరి 21(ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకులు, కార్యకర్తలు విభేదాలు వీడి ఐక్యంగా ఉండాలని ఆ పార్టీ నాయకులు బడిగింజల రంగన్న, వెంకటస్వామిగౌడ్ అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ ఇన్‌చార్జి ఎవరని ప్రస్తావించడం సరికాదన్నారు. ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థి వీరభద్ర గౌడ్ నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నారు. వైసీపీ ఆరాచకాలను తట్టుకొని పార్టీ గెలుపునకు కష్టపడ్డారన్నారు. కార్యాలయం ఇరుకుగా ఉండటంతోనే మరోటి ఏర్పాటు చేయాల్సివచ్చిందని వివరించారు. సుభాన్, నీలకంఠ గౌడ్, సర్పంచులు భాస్కర్, మహేశ్వరరెడ్డి, వీరేష్, సతీష్ ఉన్నారు.

నకిలీ విత్తనాలతో నట్టేట మునిగాం

- రైతు దంపతుల ఆవేదన


రైతు దంపతులు

పత్తికొండ టౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): నకిలీ ఉల్లి విత్తనాలతో నట్టేట మునిగామని న్యాయం చేయాలని రైతు దంపతులు మంగళవారం అధికారులను వేడుకున్నారు. బాధితులు తెలిపిన మేరకు.. మండలంలోని హోసూరు గ్రామానికి చెందిన రైతు నెట్టేకల్లు నాగమ్మ పత్తికొండ పట్టణంలోని ఓ దుకాణంలో రూ.9,600లు చెల్లించి ఉల్లి విత్తనాలను కొనుగోలు చేశారు. ఎకర్నర విస్తీర్ణంలో రూ.లక్షలు ఖర్చు చేసి, సాగు చేశామని, పంట ఎదిగినా ఉల్లిగడ్డ రాలేదు. వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేశామని, నెలలు గడిచినా న్యాయం జరగడం లేదని వాపోయారు. ఈ విషయమై ఏవో వెంకట్రాముడును వివరణ కోరగా రైతు ఫిర్యాదు మేరకు నమూనాలను సేకరించి పరీక్ష కోసం పంపామన్నారు.

రైతు కష్టం అగ్నికి ఆహుతి


రోళ్లపాడు వద్ద దహనమైన కంది పంట

తుగ్గలి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన కంది పంట అగ్నికి ఆహుతి కావడంతో రైతులు ఆవేదన చెందారు. బాధితుల కథనం మేరకు.. మండలంలోని రోళ్లపాడుకు చెందిన శాంతయ్య, ఆనంద్ కుమార్ ఆరు ఎకరాల్లో కంది సాగు చేశారు. దాదాపు రూ.1.50లక్షల పెట్టుబడి పెట్టారు. పంట కోత కోసి పొలంలో ఎండబెట్టారు. అయితే గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో కాలి బూడిదైంది. దాదాపు రూ.2 లక్షలు నష్టపోయామని బోరున విలపించారు. సీపీఐ కార్యదర్శి సుల్తాన్, వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు తులసి నాయక్, శ్రీను నాయక్ రైతులను ఓదార్చారు.

పాత్రికేయ వృత్తి విలువైనది


కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

మద్దికెర, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పాత్రికేయ వృత్తి విలువైనదని పంచాయతీ సలహాదారుడు ఆంజనేయులు, కార్యదర్శి శివకుమార్, టీడీపీ నాయకులు ఉప్పర రంగయ్య, జర్నలిస్టు సంఘం అధ్యక్షుడు కే.వీరశేఖర్ అన్నారు. మంగళవారం మద్దికెరలో కార్యాలయాన్ని ప్రారంభించారు. జర్నలిస్టులు తిక్కన్న, వెంకటేశ్వర్లు, సుల్తాన్, విజయ్, నాయకులు టైలర్‌హరి, భీసన్న, సతీష్‌కుమార్ ఉన్నారు.

పొరపాటున ఎక్కువ హాజరు వేశారట?

- వార్డెన్‌ను వెనకేసుకొచ్చిన జిల్లా బాలికల సంరక్షణ సంక్షేమ అధికారి స్నేహలత


రికార్డులను పరిశీలిస్తున్న అధికారి స్నేహలత

మద్దికెర, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): గ్రామంలోని ఆదర్శ పాఠశాల వసతి గృహంలో సోమవారం హాస్టల్ పునఃప్రారంభమైంది. అయితే మధ్యాహ్నం వరకు విద్యార్థులు హాస్టల్‌కు రాకపోయినా 70 మందికి హాజరు శాతం వేశారని జిల్లా అధికారులకు ఫిర్యాదు అందింది. దీంతో మంగళవారం జిల్లా బాలికల సంరక్షణ సంక్షేమ అధికారి స్నేహలత హాస్టల్‌ను పరిశీలించారు. 20వ తేదీ మధ్యాహ్నం ముగ్గురు పిల్లలు వచ్చారని విచారణలో తెలుసుకున్నారు. అనంతరం ఆదర్శ పాఠశాలలో రికార్డులను పరిశీలించారు. అధికారి స్నేహలత విలేకరులతో మాట్లాడుతూ 70 మంది హాజరైనట్లు పొరపాటున ఆన్‌లైన్‌లో నమోదుచేశారని, వార్డెన్‌కు అవగాహన లేదని, లిఖితపూర్వకంగా రాయించుకున్నామన్నారు. దీంతో ఈ విచారణపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రిన్సిపాల్ నవిత ఉన్నారు.

కబడ్డీ పోటీల్లో ప్రతిభ

ఆదోని అగ్రికల్చర్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా గడివేములలో నిర్వహించిన అంతర్ జిల్లా పాఠశాలల కబడ్డీ పోటీల్లో పెద్ద హరివాణం జడ్పీ ఉన్నత పాఠశాల జట్టు ప్రథమ స్థానంలో నిలిచినట్లు హెచ్ఎం ఇందిరా దేవి, పీడీ రామన్న తెలిపారు. మంగళవారం క్రీడాకారులను ఉపాధ్యాయులు అభినందించారు. వెల్దుర్తి జట్టుపై 26-06 పాయింట్లతో గెలిచి, ట్రోఫీతో పాటు రూ.20వేలు అందుకున్నారని తెలిపారు. ఎస్ఎంసీ చైర్మన్ రమేష్, ఉపాధ్యాయులు రమణమూర్తి, అబ్దుల్ రెహమాన్, కృష్ణవేణి, గణేష్, శివకుమార్ గౌడ్, రవికుమార్, ఎల్లప్ప, పర్వీన్, పుష్పలత పాల్గొన్నారు.

చెరువును కాపాడండి

ఆస్పరి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోనిని వెంగలాయి దొడ్డి చెరువును కాపాడాలని సీపీఐ, చెరువు పరిరక్షణ కమిటీ నాయకులు బసవరాజు, వీరభద్ర గౌడ్, వీరేష్ డిమాండ్ చేశారు. మంగళవారం మైనర్ ఇరిగేషన్ ఏఈ రంగడుకు వినతిపత్రం అందజేశారు. చెరువునుచి అక్రమంగా వేలాది టన్నుల ఇసుక తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. ఇసుక తవ్వకాలతో సమీప గ్రామాల్లో భగర్భజలాలు ఇంకిపోయి రైతులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. చెరువు ద్వారా 1,500 ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. ఇసుక తవ్వకాలను అడ్డుకోకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. తిక్కయ్య, రామాంజినేయులు, వీరేష్ పాల్గొన్నారు.

ప్రజల మన్ననలు పొందుతున్న కూటమి

- పత్తికొండ ఎమ్మెల్యే శ్యాంబాబు


దుకాణాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్యాంబాబు, తుగ్గలి నాగేంద్ర

మద్దికెర, జనవరి 21 (ఆంధ్రజ్యోతి):కూటమి ప్రభుత్వం ప్రజల మన్ననలను పొందుతోందని ఎమ్మెల్యే శ్యాంబాబు అన్నారు. మంగళవారం బొమ్మనపల్లి గ్రామంలో సీసీ రోడ్లను అనంతరం మద్దికెరలో పంచాయతీ దుకాణాలను ప్రారంభించారు. సీఎం చంద్రబాబు ప్రవేశపెట్టిన ఉచిత ఇసుకతో భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి పెంచారన్నారు. టీడీపీ కార్యకర్తలకు మంత్రి లోకేశ్‌కు బీమా ఇచ్చారన్నారు. గతంలో పత్తికొండ తాలుకాలో అభివృద్ధి జరగలేదని, కనీసం సీసీ రోడ్లు కూడా వేయలేకపోయారన్నారు. 8 నెలల్లో దాదాపు రూ.10 కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు తీస్తోందన్నారు. తాగునీటి సమస్య తలెత్తకుండా హంద్రీనీవా ద్వారా మద్దమ్మకుంటకు మాజీ డిప్యూటీ సీఎం కేఈ నీరు సరఫరా చేశారన్నారు. గ్రామాలకు కూడా రోడ్లు వేశారన్నారు. రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, మాజీ జడ్పీటీసీలు పురుషోత్తం చౌదరి, రాజన్న యాదవ్, ధనుంజయుడు, తహసీల్దార్ హుశేన్‌సాహెబ్, డీఈ శేషయ్య, కార్యదర్శి శివకుమార్ పాల్గొన్నారు.

లెనిన్ ఆశయ సాధనకు పోరాడాలి

పత్తికొండ టౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): సోషలిస్టు రాజ్య వ్యవస్థాపకుడు లెనిన్ ఆశయ సాధనకు పోరాడాలని సీపీఐ కార్యవర్గ సభ్యుడు రామచంద్రయ్య, జిల్లా కార్యదర్శి గిడ్డయ్య పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సీఆర్‌భవన్‌లో కామ్రేడ్ లెనిన్ శతవర్ధంతి నిర్వహించారు. భీమలింగప్ప, కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శేఖర్, జిల్లా కార్యదర్శి నబీరసూల్, ప్రజా సంఘాల నాయకులు గురుదాస్, తిమ్మయ్య, కారనన్న, వెంకట్రా మిరెడ్డి, సిద్దు, ఉపేంద్ర, నెట్టికంటయ్య పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి బీమా పరిహారం

పత్తికొండ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వం కలిగిన కార్యకర్త మరణించడంతో కుటుంబానికి రూ.2లక్షల ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అందించారు. పట్టణానికి చెందిన కార్యకర్త చాకలి వీరేశ్ కొద్దిరోజుల క్రితం ప్రమాదవశాత్తు మృతిచెందారు. మృతుడు పత్తికొండ పార్టీ కార్యాలయంలో సభ్యత్వం తీసుకొని ఉండటంతో బీమా కంపెనీ రూ.2లక్షలు అందించింది. మంగళవారం కార్యాలయంలో నాయకుడు సాంబశివారెడ్డి, లాయర్ సురేశ్, చాకలి హుల్తప్ప లతో కలిసి ఎమ్మెల్యే చెక్కు అందించారు.


బాధిత కుటుంబానికి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే

చంద్రబాబు కృషితో ఉక్కుకు ఆర్థిక భరోసా

- వీరభద్ర గౌడ్


మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్

ఆలూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు కృషితోనే విశాఖ ఉక్కుకు ఆర్థిక భరోసా లభించిందని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ అన్నారు. మంగళవారం మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారం రాష్ట్రానికే మణిహారమన్నారు. వేలాది మంది పోరాటాలు, త్యాగాలు చేసి సాధించుకున్న సంస్థ విశాఖ స్టీల్ ప్లాంట్ అన్నారు. విశాఖ ఉక్కుకు ఎన్డీఏ ప్రభుత్వం సహకారం అందిస్తుం దన్నారు. గత వైసీపీ ప్రభుత్వం సీఎం జగన్ రెడ్డి విశాఖ స్టీల్‌ను నిర్వీర్యం చేయడంతో అప్పుల్లో కూరుకుపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉత్తరాంధ్ర అభివృద్ధితో పాటు విశాఖ ఉక్కు పరిశ్రమపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. సమావేశంలో బీజేపీ ఇన్‌చార్జి వెంకట రాముడు, టీడీపీ కన్వీనర్ అశోక్, తిమ్మయ్య, నాగరాజు, సాలిసాహెబ్ పాల్గొన్నారు.

ఉపాధి కల్పించండి

పత్తికొండ టౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో వ్యవసాయ పనులు ముగిశాయని, ఉపాధి పనులు కల్పించాలని వ్యవసాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి నబీ రసూల్, కార్యదర్శి వెంకట్రామిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఏపీవో వెంకటేశ్వర్లుకు వినతి పత్రం సమర్పించారు. కారన్న, వీరన్న, గురుదాసు, నెట్టికంటయ్య, కురుకుంద సిద్దు, పాల్గొన్నారు.

వలసలను నివారించాలి

దేవనకొండ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ ప్రాంతంలో వలసలను నివారించాలని వ్యవసాయ సంఘం జిల్లా అధ్యక్షుడు వీరశేఖర్ డిమాండ్ చేశారు. ఈ నెల 23న ఆదోనిలో నిర్వహించనున్న సదస్సు కరపత్రాలను విడుదల చేశారు. ఉపాధ్యక్షుడు యూసుప్ బాషా, ఆశోక్, నాగేష్, బండ్లయ్య పాల్గొన్నారు.

ఆదుకోవాలని తహసీల్దార్‌కు వినతి

ఆలూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : కష్టపడి పండించిన కంది పంట అగ్నికి దగ్ధమైందని ఆదుకోవాలని హులేబీడు గ్రామ రైతు నల్ల బోతుల నాగరాజు కోరారు. మంగళవారం తహసీల్దార్ గోవింద్ సింగ్‌కు వినతిపత్రం అందించారు. తాను ఏడు ఎకరాల్లో సాగు చేశానని గొర్రెల కాపరులు బీడీలు తాగి పడేయడంతో అగ్నికి ఆహుతైందని, తనకు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం ఇప్పించి ఆదుకోవాలని విన్నవించారు. కోరారు.

బకాయిలు కట్టించలేకపోతున్నాం


కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎల్‌టీపీలు

ఆదోని టౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణాల బకాయిలను యజమానులతో కట్టించలేకపోతున్నామని ఎల్‌టీపీలు మంగళవారం మున్సిపల్ కమిషనర్ కృష్ణకు విన్నవించారు. ఆన్‌లైన్‌లో కొన్ని ఫీజులు చెల్లించకపోవడంతో వాటిని యజమానులతో కట్టించే బాధ్యతను ఎల్‌టీపీలకు అప్పగించారు. దీనిని పట్టణ ప్రణాళిక అధికారులే నోటీసులు జారీచేసి వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎల్‌టీపీ అసోసియేషన్ సభ్యులు రంగస్వామి, చంద్ర శేఖర్, ఈరన్న, రఫిక్, సాబీర్ పాల్గొన్నారు.

నగరడోణ పనులను ప్రారంభించాలి

ఆలూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): నిలిచిపోయిన నగరడోణ రిజర్వాయర్ పనులను ప్రారంభించాలని కాంగ్రెస్ ఇన్‌చార్జి చిప్పగిరి లక్ష్మీనారాయణ ఎస్ఈ రాజశేఖర్‌ను కోరారు. రిజర్వాయర్ పూర్తయితే 4,500 ఎకరాలకు సాగునీరు అందుతుందని, ప్రభుత్వం దృష్టికి తీసికెళ్లాలని కోరారు. నాయకులు గాలి మల్లికార్జున, మహేంద్ర, కరెంటు గోవిందు, వీరాంజనేయులు ఉన్నారు.

రేపు మెగా రక్తదాన శిబిరం

ఆలూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మంత్రి లోకేశ్ జన్మదినం సందర్భంగా గురువారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు టీడీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్, వైకుంఠం జ్యోతి మంగళవారం ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో శిబిరం ఉంటుందన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

తుగ్గలి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే శ్యాంబాబు అన్నారు. మంగళవారం మండలంలోని రాంపల్లిలోని సుంకులమ్మ, ఆంజనేయస్వామి ఆలయాల్లో పూజలు చేశారు. యోగేశ్ స్వామీజిని శాలువతో పూలమాలతో సన్మానించారు. తిరుపాల్ నాయుడు, రాంపల్లి శ్రీనివాసులు, ప్రతాప్ యాదవ, హేమాద్రినాయుడు, టీడీపీ నాయకుడు, గ్రామ పెద్దలు ఉన్నారు.

పాడి పరిశ్రమ అభివృద్ధికి కృషి

మద్దికెర, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పాడిపరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని పశువైద్యాధికారి కృష్ణ నాయక్ అన్నారు. మంగళవారం బసినేపల్లి గ్రామంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ప్రభుత్వం 70 శాతం రాయతీతో పశువులు, గొర్రెలు, మేకలు, షెడ్లకు నిధులు ఇస్తుందన్నారు.

కాలువ ఆధునికీకరణకు కృషి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడు నగరడోణ కిష్టప్ప



ఆలూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఆలూరు బ్రాంచి కాలువ అభివృద్ధికి కృషి చేస్తానని డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడు నగరడోణ కిష్టప్ప అన్నారు.

ప్రశ్న: ఆలూరు కాలువ పరిధిలో ఆయకట్టు ఎంత?

జవాబు: 19వ డిస్ట్రిబ్యూటరీ కమిటీ పరిధిలో 14,250 ఎకరాల ఆయకట్టు ఉంది. 6 టీసీలు ఉన్నాయి. చిప్పగిరి, ఆలూరు, హాలహర్వి మండలాలున్నాయి.

ప్రశ్న: కాలువల ఆధునీకరణకు చర్యలు తీసుకున్నారా?

జవాబు: ప్రభుత్వానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. చిన్న నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును కలిసి బడ్జెట్ కేటాయించాలని కోరతాం.

ప్రశ్న: నగరడోణ రిజర్వాయర్ పరిస్థితి ఏమిటి?

జవాబు: నిలిచిపోయిన నగరడోణ రిజర్వాయర్‌ను పూర్తిచేసి సాగునీరు అందించేందుకు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ సహకారంతో సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరయ్యేలా ప్రయత్నిస్తాం.

ప్రశ్న: ఏబీసీ కెనాల్ కార్యాలయం నామమాత్రంగా ఉందనే ఆరోపణలున్నాయి?

జవాబు: కార్యాలయ సిబ్బంది అందుబాటులో ఉండి రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చేలా చూస్తాం.

ప్రశ్న: సాగునీటిని కొందరు అక్రమంగా మళ్లించుకున్నారని ఆరోపణలున్నాయి?

జవాబు: నీటిని అక్రమంగా మళ్లించుకోకుండా సిబ్బందిని అప్రమత్తం చేస్తాం. కాలువలపై పర్యవేక్షణ పెంచుతాం. అక్రమంగా ఉపయోగిస్తే రైతులు ఫిర్యాదు చెయ్యాలి.

ఎమ్మిగనూరు

● ఎమ్మిగనూరు ● మంత్రాలయం

వలస బాట



నౌలేకల్లు గ్రామం నుంచి తెలంగాణకు వలస వెళ్తున్న కూలీలు

పెద్దకడుబూరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మేకడోన, నౌలేకల్లు, పెద్దకడుబూరు గ్రామాల నుంచి కూలీలు వలస బాట పట్టారు. మంగళవారం దాదాపు 300 కుటుంబాలు పిల్లాపాపలతో కలిసి మూటముల్లె సర్దుకొని బొలెరో వాహనాల్లో బయల్దేరి వెళ్లారు. కొన్ని రోజులుగా మండలంలోని ఆయా గ్రామాల నుంచి రోజు 100 నుంచి 150 కుటుంబాలు కర్నాటక, తెలంగాణ ప్రాంతాలకు వలసలు వెళ్తునే ఉన్నారు. ఒక్క మేకడోన గ్రామంలోనే మంగళవారం మూడు ప్రైవేట్ వాహనాల్లో దాదాపు 200 కుటుంబాలు వలస వెళ్లడంతో ఊరిలో ముసలివారితో పాటు కొంతమంది జనం మాత్రమే కనిపిస్తున్నారు. అధికారులు స్పందించి గ్రామాల్లోని రైతులు, కూలీలు వలసలు వెళ్లకుండా ఉపాధి పనులు కల్పించాలని కోరుతున్నారు.

వలసలు నివారించాలి

ఎమ్మిగనూరు రూరల్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు ప్రాంతంలో వలసలను నివారించాలని ఐవైపీఎల్ జిల్లా కార్యదర్శి చిన్న ప్రసాద్ కోరారు. మంగళవారం తహసీల్దార్ శేషఫణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు లేకపోవడంతో ఆయా గ్రామాల్లోని రైతులు, రైతు కూలీలు పొట్టచేతపట్టుకొని ఇతర రాష్ట్రాలకు వలసలు వెళ్తున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే కలుగజేసుకొని గ్రామాల్లో పనులు కల్పించి వలసలు నివారించాలన్నారు. కార్యక్రమంలో నవీణ్, యల్లప్ప పాల్గొన్నారు.

రోజుకు రూ.300 కూలి ఇస్తాం: ఏపీవో



మాధవరంలో కూలీలతో మాట్లాడుతున్న ఏపీవో తిమ్మారెడ్డి

మంత్రాలయం జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనుల్లో రోజుకు రూ.300లు కూలి ఇస్తామని వలసలు వెళ్లవద్దని ఉపాధి ఏపీవో తిమ్మారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని మాధవరం, రచ్చుమర్రి, సూగూరు, చీలకలడోన గ్రామాల్లో వ్యవసాయ కూలీలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏపీవో మాట్లాడుతూ వంద రోజులు పనిదినాలు ఉపయోగించుకోవాలని సూచించారు. పిల్లలను చదువులు మాన్పించి వలసలు వెళ్లడంతో భవిష్యత్తుకు నష్టం కలిగించవద్దని, సొంత గ్రామాల్లోనే పనులు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఈసీ శ్రీనివాసులు, గ్రామ కార్యదర్శి వేణుగోపాల్, మహేష్, టెక్నికల్ అసిస్టెంట్ రేణుక, మరుధ్వతి, హనుమంతు, ఫీల్డ్ అసిస్టెంట్లు రాగమ్మ, మజ్జిగ బొజ్జప్ప, రైతులు కూలీలు ఉన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ శేషఫణి

ఎమ్మిగనూరు రూరల్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చేయడం వల్ల కలిగే అనర్థాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని తహసీల్దార్ శేషఫణి సూచించారు. మంగళవారం ఎంపీడీవో సమావేశ భవనంలో ఆయా గ్రామాల సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలకు కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా సీడీపీవో సఫరున్నిసాబేగం ఆధ్వర్యంలో ఒక్కరోజు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన తహసీల్దారు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ఆడ పిల్లలను చదువు మధ్యలోనే మాన్పించి పెళ్లిళ్లు చేయడం అధికమైందన్నారు. ఇందుకు తల్లిదండ్రులకు అవగాహన లేకపోవమే ప్రధాన కారణమన్నారు. బాల్య వివాహాలు చేయడం వల్ల కలిగే నష్టాలను ప్రజలకు వివరించాలన్నారు. విద్య ఆవశ్యకతను తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు గుణశేఖరమ్మ, ప్రీతి, సురేఖ, భాగ్యలక్ష్మి, రాధా, జరీనా, ఆయా గ్రామాల సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

కోసిగి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): నీటి కుంటలో పడి జంపాపురం గ్రామానికి చెందిన కురువ నరసమ్మ, కురువ రఘువరన్ విద్యార్థుల కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వీరేష్ కోరారు. ప్రభుత్వం బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని, గ్రామాల్లో నీటి కుంటలను పూడ్చివేయాలన్నారు.

బైలుప్పలలో పారిశుధ్య పనులు

గోనెగండ్ల, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని బెలుప్పల గ్రామంలో అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలో భాగంగా వీధుల్లో పారిశుధ్య పనులు చేపడుతున్నట్లు పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు తెలిపారు. సీజనల్ వ్యాధుల కాలం కావడంతో మురుగు, బురదనీరు నిలువ ఉన్నచోట దోమలు, ఈగలు ప్రబలకుండా బ్లీచింగ్ చల్లి, వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేయించినట్లు తెలిపారు.

పొరపాటున ఎక్కువ హాజరు వేశారట?

• వార్డెన్‌ను వెనకేసుకొచ్చిన జిల్లా బాలికల సంరక్షణ సంక్షేమ అధికారి స్నేహలత

మద్దికెర, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): గ్రామంలోని ఆదర్శ పాఠశాల వసతి గృహంలో సోమవారం హాస్టల్ పునఃప్రారంభమైంది. అయితే మధ్యాహ్నం వరకు విద్యార్థులు హాస్టల్‌కు రాకపోయినా 70 మందికి హాజరు శాతం వేశారని జిల్లా అధికారులకు ఫిర్యాదు అందింది. దీంతో మంగళవారం జిల్లా బాలికల సంరక్షణ సంక్షేమ అధికారి స్నేహలత హాస్టల్‌ను పరిశీలించారు. 20వ తేదీ మధ్యాహ్నం ముగ్గురు పిల్లలు వచ్చారని విచారణలో తెలుసుకున్నారు. అనంతరం ఆదర్శ పాఠశాలలో రికార్డులను పరిశీలించారు. స్నేహలత విలేకరులతో మాట్లాడుతూ 70 మంది హాజరైనట్లు పొరపాటున ఆన్‌లైన్‌లో నమోదు చేశారని, వార్డెన్‌కు అవగాహన లేదని, లిఖిత పూర్వకంగా రాయించుకున్నామన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న అధికారి స్నేహలత

వేరుశనగ రైతుల ఆశలు ఆవిరి

- గిట్టుబాటు ధర అంతంతమాత్రమే..
- ఎకరానికి రూ. 60 వేల పెట్టుబడి
- ఎనిమిది క్వింటాళ్ల లోపే దిగుబడి

గోనెగండ్ల, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది వేరుశనగ పంట దిగుబడి గణనీయంగా తగ్గింది. దీనికి తోడు ధర కూడా అంతంత మాత్రమే ఉండటంతో వేరుశనగ రైతన్నలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మిగనూరు నియోజక వర్గంలోని ఎమ్మిగనూరు, నందవరం, గోనెగండ్ల మండలాల్లో పదివేల ఎకరాల్లో వేరుశనగ పంటను సాగు చేశారు. గోనెగండ్ల మండలంలో ఈ రబీ సీజన్‌లో మూడు వేల ఎకరాల్లో వేరుశనగ పంటను సాగుచేశారు. గోనెగండ్ల, గాజులదిన్నె, అలువాల, చిన్నమరివీడు, కులుమాల, వేముగోడు, ఐరన్‌బండ, హెచ్‌కైరవాడి, పుట్టపాశం, పెద్దనేలటూరు, చిన్ననేలటూరు, పెద్దమరివీడు, తిప్పనూరు గ్రామాల్లో అధికంగా వేరుశనగను సాగు చేశారు. ఎకరానికి రూ. 55వేల నుంచి రూ. 60వేల వరకు పెట్టారు. గతేడాది వేరుశనగ పంట రైతు ఆశించిన స్థాయిలో దిగుబడి రావడంతో ఈ ఏడాది రైతు ఎక్కువగానే సాగు చేశారు. అయితే ఈ ఏడాది రైతులు ఆశించిన మేర దిగుబడి రాలేదు. ఎకరానికి కేవలం ఏడు నుంచి ఎనిమిది క్వింటాళ్లకు పడిపోయింది. దీంతో రైతుకు కనీస పెట్టుబడి కూడా చేతికి రాక అప్పుల ఊబిలో కూరుకు పోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని వేరుశనగ రైతులు వాపోతున్నారు.



వేరుశనగ పంటను కోస్తున్న కూలీలు

అకాల వర్షాల కారణంగా : వాతావరణం అనుకూలించక పోవడంతో బోర్లలో నీరు అడుగంటి పోవడంతో సాగు చేసిన పంటకు సకాలంలో నీరు అందించలేక పోయారు. ఈ ఏడాది అకాలవర్షాల కారణంగా దిగుబడి తగ్గిపోయింది. మార్కెట్‌లో జవారి వేరుశనగ ధర క్వింటంకు రూ. 4800 నుంచి రూ.5900 పలుకుతుంది. దిగుబడి తగ్గిపోవడంతో పెట్టిన పెట్టుబడులు కూడా చేతికి అందేవిధంగా లేవని రైతులు వాపోతున్నారు. క్వింటానికి రూ. తొమ్మిది వేల నుంచి రూ. పదివేలు కల్పిస్తే బాగుంటుందని రైతులు కోరుతున్నారు.

దిగుబడి గణనీయంగా తగ్గింది

ఒక ఎకరంలో వేరుశనగ సాగు చేశాను. పెట్టుబడి దాదాపు రూ. 60వేలు వచ్చింది. దిగుబడి మాత్రం పూర్తిగా తగ్గిపోయింది. పంటపై చేసిన అప్పులు తీర్చే పరస్థితి కనిపించడం లేదు. ఈ ఏడాది వేరుశనగ ఆశించిన స్థాయిలో దిగుబడి లేదు.

- ఉపేంద్ర, రైతు ఐరన్‌బండ

ప్రభుత్వం ఆదుకోవాలి

ఈఏడాది వేరుశనగ పంట దిగుబడి చాల తగ్గింది. పండిన అరకొర పంటకు గిట్టుబాటు ధర కూడా లేదు. రైతులు పెట్టిన పెట్టుబడులు కూడా చేతికిరావు. ప్రభుత్వం వేరుశనగ రైతులను ఆదుకోవాలి.

- శ్రీనివాసుల నాయుడు, రైతు గాజులదిన్నె

స్వర్ణ రథంపై ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయులు స్వర్ణ రథంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. మంగళవారం సప్తమిని పురస్కరించుకుని శ్రీ మఠం పీఠాదిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూర్ణబోధ పూజ మందిరంలో మూలరాములకు, జయరాములు, దిగ్విజయరాములకు కనకాభిషేకం చేశారు. వేద పండితుల మంత్రోచ్చరణాలు, మంగళ వాయిద్యాల మధ్య స్వర్ణ రథం పై వజ్రాలు పొదిగిన ప్రహ్లాదరాయలను అధిష్టించి ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. అనంతరం ఊంజలసేవ నిర్వహించారు. భక్తులు గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్రస్వామికి విశేష పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మఠం పీఠాధిపతి భక్తులకు ఫల, పుష్ప, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు.

మంత్రాలయంలో పోటెత్తిన భక్తులు

రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో మంత్రాలయం సందడిగా మారింది. దక్షిణాది రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. కర్ణాటకలోని బాగల్‌కోట, గదక్ ప్రాంతాల నుంచి దాదాపు 250కిమీ వేలాది మంది భక్తులు పాదయాత్రతో మంగళవారం రాత్రికి మంత్రాలయంకు చేరుకున్నారు. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖద్వారం, మధ్వమార్గ్ కారిడార్, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, తుంగభద్ర నది తీరం భక్తులతో కోలాహలంగా మారింది. తుంగభద్ర నదిలో పుణ్య స్నానాలు ఆచరించి గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. రథోత్సవాల ఊరేగింపులో పాల్గొని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆశీస్సులు పొందారు



స్వర్ణ రథంపై ఊరేగుతున్న ప్రహ్లాదరాయలు

విద్యార్థుల మృతి బాధాకరం

మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న రాఘవేంద్రరెడ్డి

కోసిగి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): నీటి కుంటలో పడి విద్యార్థులు మృతి చెందడం బాధాకరమని టీడీపీ మంత్రాలయం ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి అన్నారు. మండల పరిధిలోని జంపాపురం గ్రామానికి చెందిన కురువ పెద్ద నరసింహులు, పద్మ దంపతుల పిల్లలు నర్సమ్మ, రఘువరన్ సోమవారం నీటి కుంటలో పడి మృతి చెందారు. మంగళవారం గ్రామంలో విద్యార్థుల భౌతిక కాయాలకు రాఘవేంద్రరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులకు ధైర్యమిస్తూ ప్రభుత్వం నుంచి అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. మట్టి ఖర్చులకు రూ.10వేలు తండ్రి పెద్ద నరసింహులుకు రాఘవేంద్రరెడ్డి అందజేశారు. ఇందులో టీడీపీ నాయకులు ముత్తురెడ్డి, పల్లెపాడు రామిరెడ్డి, నాడిగేని అయ్యన్న, చిన్నతాయన్న, బసప్ప, బసవరాజు, చిదానంద ఉన్నారు.

తూతూ మంత్రంగా పశువైద్య శిబిరాలు

గోనెగండ్ల, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ముందస్తు సమాచారం అందించకపోవడంతో మండలంలో పశువైద్య శిబిరాలు తూతూ మంత్రంగా సాగుతున్నాయని పాడి రైతులు విమర్శిస్తున్నారు. ప్రభుత్వం గ్రామాలలో ఈనెల 20నుంచి 31వరకు పశువైద్యశిబిరాలు ఏర్పాటు చేసింది. శిబిరాలలో పశువులకు నట్టల నివారణ మందు తాపించడం, గర్భకోశవ్యాధి చికిత్స, లంపీస్కిన్ తో పాటు అన్ని రకాల రోగాలకు చికిత్స అందించాల్సి ఉంది. అయితే పశువైద్యాధికారులు రైతులకు ముందస్తు అవగాహన కల్పించకుండా కేవలం నట్టల మందులు తాపి తూతూ మంత్రంగా ముగిస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. మంగళవారం అలువాల గ్రామంలో పశువైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. అయితే రైతులందరికి తెలియకపోవడంతో కొంత మంది రైతులు మాత్రమే శిబిరానికి హాజరయ్యారు. అధికారులు ముందుస్తుగా సమాచారం అందించి శిబిరాలు నిర్వహిస్తే ప్రయోజనం ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

రీ సర్వేతో భూములు భద్రం

మంత్రాలయం జనవరి 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ రీసర్వేను సద్వినియోగం చేసుకుని భూములను భద్రం చేసుకోవాలని తహసీల్దారు ఎస్.రవి అన్నారు. మంగళవారం మండలంలోని చెట్నహల్లి గ్రామంలో సర్వేనెం.184, 185లోని 20 ఎకరాల భూములను రైతులతో కలిసి రీసర్వే చేసి సరిహద్దులను పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ రీసర్వే ద్వారా భూ హక్కులు యజమానులకు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సరస్వతి, మండల సర్వేయర్ అశోక్, సర్వేయర్లు నవీన్ కుమార్, శేఖర్ నాయక్, వీఆర్వో భీమయ్య, నాగేష్ పాల్గొన్నారు.

ఉద్యోగావకాశాలు కల్పించాలి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

ఎమ్మిగనూరు రూరల్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఏఐటీయూసీ తాలుకా అధ్యక్ష, కార్యదర్శులు వీరేష్, తిమ్మగురుడు అన్నారు. మంగళవారం సీపీఐ కార్యాలయం ముందు ఏఐటీయూసీ నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక, కర్షకులతోపాటు ఉద్యోగులకు మెరుగైన జీవన ప్రమాణాలను కల్పించాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉన్న ఖాళీలను పూర్తి చేసి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. ఉద్యోగ, కార్మిక, కర్షకులకు అన్ని రకాల బిల్లులు సకాలంలో చెల్లించి ఉద్యమబాట పట్టకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పంపన్నగౌడు, ఉరుకుందు, ఏఐటీయూసీ నియోజకవర్గ సహాయ కార్యదర్శి విజయేంద్ర, వీరాంజేయులగౌడు, యోహన్, రంగస్వామిగౌడు, వీరేంద్ర పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లినా మారని పేర్లు



తహసీల్దార్ కార్యాలయంలో బోర్డుపై బదిలీపై వెళ్లిన అధికారుల పేర్లు

పెద్దకడుబూరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): పెద్దకడుబూరు తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు బదిలీపై వెళ్లినా వారి పేర్లు మాత్రం బోర్డులపై కొనసాగుతునే ఉన్నాయి. కొంతకాలంగా ఇక్కడి నుంచి ఆర్ఐ బి. మహేష్, సీనియర్ సహాయకులు జీ. మహేష్ బదిలీపై వేరే ప్రాంతాలకు వెళ్లారు. అయితే ఇక్కడి అధికారులు మాత్రం వారి పేర్లను మార్చలేదు. కేవలం తహసీల్దార్ పేరు మాత్రమే మార్చి మిగతా అధికారుల పేర్లను అలాగే వదిలేయడంతో మండల ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

రేపు మండల సమావేశం

గోనెగండ్ల, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం 11గంగలకు మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మణిమంజరి మంగళవారం తెలిపారు. సమావేశం ఎంపీపీ నసూరుద్దీన్ అధ్యక్షతన కొనసాగుతుందని పేర్కొన్నారు. మండలంలోని జడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచులు హాజరుకావాలని కోరారు. అధికారులు విధిగా ప్రగతి నివేదికలతో రావాలని సూచించారు. మండలంలో నెలకొన్న సమస్యల పై సమావేశంలో చర్చించి పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఆమె అన్నారు.

రైతు కష్టం అగ్నికి ఆహుతి

తుగ్గలి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన కంది పంట అగ్నికి ఆహుతి కావడంతో రైతులు ఆవేదన చెందారు. బాధితుల కథనం మేరకు.. మండలంలోని రోళ్లపాడుకు చెందిన శాంతయ్య, ఆనంద్ కుమార్ ఆరు ఎకరాల్లో కంది సాగు చేశారు. దాదాపు రూ.1.50లక్షల పెట్టుబడి పెట్టారు. పంట కోత కోసి పొలంలో ఎండబెట్టారు. అయితే గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో కాలి బూడిదైంది. దాదాపు రూ.2 లక్షలు నష్టపోయామని బోరున విలపించారు. సీపీఐ కార్యదర్శి సుల్తాన్, వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు తులసి నాయక్, శ్రీను నాయక్ రైతులను ఓదార్చారు.

రోజుకు రూ.300 కూలి ఇస్తాం: ఏపీవో



మాధవరంలో కూలీలతో మాట్లాడుతున్న ఏపీవో తిమ్మారెడ్డి

మంత్రాలయం జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనుల్లో రోజుకు రూ.300లు కూలీ ఇస్తామని వలసలు వెళ్లవద్దని ఉపాధి ఏపీవో తిమ్మారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని మాధవరం, రచ్చుమర్రి, సూగూరు, చీలకలడోన గ్రామాల్లో వ్యవసాయ కూలీలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏపీవో మాట్లాడుతూ వంద రోజులు పనిదినాలు ఉపయోగించుకోవాలని సూచించారు. పిల్లలను చదువులు మాన్పించి వలసలు వెళ్లడంతో భవిష్యత్తుకు నష్టం కలిగించవద్దని, సొంత గ్రామాల్లోనే పనులు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఈసీ శ్రీనివాసులు, గ్రామ కార్యదర్శి వేణుగోపాల్, మహేష్, టెక్నికల్ అసిస్టెంట్ రేణుక, మరుధ్వతి, హనుమంతు, ఫీల్డ్ అసిస్టెంట్లు రాగమ్మ, మజ్జిగ బొజ్జప్ప తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి చేనేత కార్మికులకు శిక్షణ



చేనేత కార్మికులతో సమావేశమైన అధికారులు

ఎమ్మిగనూరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరుకు చెందిన 25 మంది చేనేత కార్మికులు, మాస్టార్ వీవర్స్‌కు ఈ నెల 23 నుంచి మంగళగిరిలో శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా చేనేత జౌళి శాఖ అధికారి నాగరాజు తెలిపారు. మంగళవారం స్థానిక కుర్ణీ కమ్యూనిటీ హాల్‌లో అధికారులు చేనేత కార్మికులు, మాస్టార్ వీవర్స్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ చెన్నైకి చెందిన హ్యాండ్‌లూమ్స్ ఎక్స్‌పోర్టు కౌన్సిల్ వారు ఎమ్మిగనూరు ప్రాంతాన్ని చేనేత వస్త్రాల ఉత్పత్తి సామర్థ్యం ఉన్న ప్రాంతంగా గుర్తించారన్నారు. దీంతో ఈ ప్రాంతానికి చెందిన చేనేత కార్మి కులు మాస్టార్ వీవర్స్ 25 మంది ఇంపోర్టు, ఎక్స్‌పోర్టు కోడ్‌ను తీసుకు నేందుకు ముందుకు వచ్చారన్నారు. దీంతో వీరికి ఈ నెల 23నుంచి మంగళగిరిలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

మంత్రాలయం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం తుంగభద్ర నది ఒడ్డున గంగమ్మ గుడి సమీపంలో ఈడిగ నాగరాజు అనే వ్యక్తి కర్ణాటక నుంచి మద్యం ప్యాకెట్లను తన మోటార్ సైకిల్‌పై విక్రయిస్తుండగా మంత్రాలయం ఎస్ఐ పరమేష్ నాయక్ దాడులు చేసి పట్టుకున్నారు. మంగళవారం సీఐ రామాంజులు ఆదేశాలు మేరకు రహస్యంగా వచ్చిన సమాచారం మేరకు దాడులు చేసి 120 కర్ణాటక 90 ఎంఎల్ మద్యం టెట్రా ప్యాకెట్లును స్వాధీనం చేసుకొని వ్యక్తిని అరెస్టు చేశారు. బైక్‌ను సీజ్ చేసి నిందితున్ని ఎమ్మిగనూరు కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. మంత్రాలయం పుణ్యక్షేత్రంతో పాటు గ్రామాల్లో కర్ణాటక మద్యం విక్రయించినా, సరఫరా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.



పట్టుబడిన కర్ణాటక మద్యంతో ఎస్ఐ పరమేష్ నాయక్, పోలీసులు

చంద్రబాబు కృషితోనే

విశాఖ ఉక్కుకు ఆర్థిక భరోసా

ఎమ్మెల్యే బీవి జయనాగేశ్వర రెడ్డి



ఎమ్మిగనూరు, జనవరి21(ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు ఆంధ్ర హక్కు అంటూ నాడు ఎంతో మంది తెలుగు ప్రజలు వీరోచిత పోరాటాలు త్యాగాలు చేసి సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమ పునర్జీవంపచేయడానికి సీఎం చంద్రబాబు చేసిన కృషితో ఆర్థిక భరోసా లభించిందని ఎమ్మెల్యే బీవి జయనాగేశ్వర రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడేందుకు రూ. 11440 కోట్ల ప్యాకేజీ ఇచ్చిందుకు కేంద్రం ఆమోదం తెలిపిందని హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేంద్రానికి కృతజ్ఞతనలు తెలిపారు. నాడు నష్టాల్లో ఉన్నప్పుడు కాపాడింది...నేడు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో నుంచి పరిశ్రమను గట్టెక్కించింది చంద్రబాబేనన్నారు.

సీఎం కృషితోనే విశాఖ ఉక్కుకు ఆర్థిక భరోసా

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి



మంత్రాలయం జనవరి 21 (ఆంధ్రజ్యోతి): తీవ్ర సంక్షోభం, నష్టాల్లో ఉన్న విశాఖ స్టీల్ ప్లాంట్‌కు సీఎం చంద్రబాబు కృషితోనే ఆర్థిక భరోసా దక్కిందని టీడీపీ మంత్రాలయం నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన తన నివాసంలో ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో భ్రష్టు పట్టిన రాష్ట్రాన్ని అభి వృద్ధి దశలో నడిపించడమే చంద్రబాబు ధ్యేయమన్నారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కుగా కలిసి పోరాటాలు చేసి సాధించుకు న్నామ న్నారు. సంపద సృష్టిస్తూ సంక్షేమం, అభివృద్ధి ఫలాల కోసం కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు రఘునాథరెడ్డి, రామకృష్ణారెడ్డి, రాజారెడ్డి పాల్గొన్నారు.

బాబోయ్ కోతులు

భయాందోళనలో కాలనీవాసులు

గోనెగండ్ల, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కోతుల బెడద ఎక్కువైంది. ఇళ్లు, గోడలు, చెట్లపై కోతులు గెంతులు వేస్తూ కాలనీ వాసులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. గుంపులుగా ఇళ్లలోకి చొరబడుతున్నాయి. దీంతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. పూల మొక్కలను చేతికి చిక్కిన వస్తువులను విసిరి వేస్తున్నాయి. పగల కొడుతున్నాయి. దీనికి తోడు ఆరుబయల ఉన్న చిన్నారులపై ఎక్కడ దాడి చేస్తాయోనని కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు. అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకొని కోతుల బెడద నుంచి కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు.



వీధుల్లో సంచరిస్తున్న కోతులు